శుక్రవారం
15-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 24
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మద్య నిషేధం హుళక్కే !

- మూడేళ్ల బార్ల పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం
- స్టార్ హోటల్స్‌లో అర్థరాత్రి వరకూ తాగే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి: దశలవారీ మద్యం విక్రయాలు తగ్గిస్తూ, 2024 నాటికి పూర్తిగా మద్యనిషేధం విధిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆచరణలో దానికి పూర్తి విరుద్ధంగా వ్యవహరి స్తోంది. మద్యం ఆదాయమే కీలకంగా భావిస్తోంది. ఇప్పటికే మద్యంపై ఆదాయాన్ని చూపుతూ భారీ ఎత్తున అప్పులు తెస్తున్న ప్రభుత్వం, ఇక ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీని అటకెక్కించడం ఖాయమని తేలిపోయింది. దీనిలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం గురువారం బార్ల పాలసీని విడుదల చేసింది. వచ్చే మూడేళ్ల కాలానికి ఈ విధానం అమల్లో ఉంటుంది. దీనిని బట్టి మద్యనిషేధం హుళక్కేనని తేలిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ కొత్త బార్ల విధానం అమల్లోకి రానుంది. దీంతో ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం అప్పటివరకూ కొనసాగే అవకాశం ఉంది. బార్ లైసెన్సుల జారీకి సంబంధించి ది ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ రూల్స్ 2022 నోటిఫికేషన్ జీవో 527ను ఎక్సైజ్ శాఖ అధికారులు జారీ చేశారు. దేశీయంగా తయారైన, విదేశీ మద్యం రవాణాకు లైసెన్సుదారునికి అవకాశం ఇస్తూ నిబంధనలు ఖరారు చేశారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని మొత్తం మూడు కేటగిరీలుగా విభజించారు. 50 వేలు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.5 లక్షలు, ఏడాదికి నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.15 లక్షలు, 50 వేలు నుంచి 5 లక్షల మధ్య ఉన్న జనాభా ప్రాంతానికి రూ.7.50 లక్షలు, ఏడాదికి

- మిగతా 2 లో

పార్లమెంటులో ఆ పదాలు నిషేధం

ఎంపీలకు ఉత్తర్వులు జారీ

న్యూఢిల్లీ: పార్లమెంటులో మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలని, ఇష్టమొచ్చినట్లు పదాలను వినియోగిస్తే ఊరుకునేది లేదని ఉభయ సభ ఎంపీలకు 'గాగ్ ఆర్డర్' జారీ అయింది. 'జుమ్లా జీవి', కొవిడ్ స్ప్రెడర్, స్నూప్ గేట్ లాంటి మాటలు మొదలుకొని, సిగ్గుచేటు, వేధింపులు, మోసం, అవినీతి, అసమర్థుడు వంటి పదాలు సైతం వాడేందుకు వీల్లేదని ఉత్వర్వులు పేర్కొన్నాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆరంభం వేళ పార్లమెంటులో ఏయే పదాలను వాడకూడదో పేర్కొంటూ ఒక బుక్‌లెట్‌ను లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసింది. లోక్‌సభలో డ్రామా, హిపోక్రసీ, నియంత, శకుని, తానాషా, వినాశ పురుష్, ఖలిస్తానీ, ద్రోహచరిత్ర, చెంచా, చెంచాగిరి, పిరికివాడు, క్రిమినల్, మొసలి కన్నీళ్లు, గాడిద, అసమర్థుడు, గూండాలు, అహంకారి, చీకటి రోజులు, దాదాగిరి, విశ్వాస ఘాతకుడు వంటి పదాలను చట్టసభల సభ్యులు తమ ప్రసంగాల్లో వాడకూడదని స్పష్టంచేశారు. అన్‌పార్లమెంటరీ పదాల జాబితాలో 'జుమ్లాజీవి, బైల్‌బుద్ధీ, కోవిడ్ స్ప్రెడర్, స్నూప్‌గేట్, అషేమ్‌డ్, అబ్యూజ్డ్, డ్రామా, బిట్రేయ్‌డ్, కరప్ట్, హిపోక్రసీ, ఇన్‌కాంపిటెంట్, శకుని, తానాశాహీ, వినాశ్‌పురుశ్, జైచంద్, ఖలిస్తానీ, ఖూన్ కే ఖేతీ, డిక్టేటర్, డిక్టేటోరియల్, అనార్కిస్ట్, ద్రోహచరిత్ర, నికమ్మా, నౌటంకీ, దిన్‌దోరా పీట్‌నా, బెహరీ సర్కార్' వంటివి ఉన్నాయి. వీటిని సభలో ఉపయోగిస్తే రికార్డుల నుంచి తొలగించడంతో పాటు సభాపతి ఆ పదాలు

- మిగతా 2 లో

అవునా.. ఆ పదాలు అమర్యాదకరమా..!! 2 లో

తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్మికుల ప్రదర్శన

మాపై ఎందుకింత

నిర్లక్ష్యం?

- సమ్మె చేస్తున్నా స్పందనలేని ప్రభుత్వంపై కార్మికుల ఆగ్రహం
- నాల్గవ రోజూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, అర్థనగ్న ప్రదర్శనలు
- మున్సిపల్ కార్మికుల సేవలను ప్రత్యేక దృష్టితో చూడాలి: బీవీ రాఘవులు
- సీఎం హామీలే అమలు చేయమని కోరుతున్నాం: సుబ్బారాయుడు

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి: మున్సిపల్ కార్మికుల సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలు కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం నాల్గవరోజుకి చేరుకుంది. దీంతో అన్ని మున్సిపాలిటీల్లో ఎక్కడి చెత్త అక్కడ గుట్టలుగా పేరుకుపోయింది. మరో పక్క ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ప్రభుత్వం సమ్మె విరమణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎందుకింత

- మిగతా 2 లో

విజయవాడ ధర్నాలో మాట్లాడుతున్న రాఘవులు. పక్కన సుబ్బారాయుడు, నెక్కంటి సుబ్బారావు, బాబూరావు తదితరులు

రూ.21వేలకు ఓకే
సమ్మె విరమించండి: మంత్రి సురేష్

మున్సిపల్ కార్మికుల డిమాండ్‌ల విషయంలో సీఎం జగన్ సానుకూలంగా స్పందించారని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి అదిమూలపు సురేష్ మీడియాకు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశమయ్యామని, ఓహెచ్‌వో ఇచ్చేందుకు 6 వేలు

- మిగతా 2 లో

సమ్మెను బలహీనపర్చడానికే : సుబ్బారాయుడు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయకుండా బలహీనపర్చడానికి యత్నిస్తోందని మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) కన్వీనర్ పి.సుబ్బారాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారని చెపుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కార్మిక సంఘాలతో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. జేఏసీ నేతలను కనీసం చర్చలకు

- మిగతా 2 లో

గోదావరి
మహోగ్రరూపం

- లంకగ్రామాలు బిక్కుబిక్కు
- మునిగిన ఉద్యాన పంటలు, నర్సరీలు
- భద్రాచలం వంతెనపై రాకపోకలు నిషేధం

విశాలాంధ్ర‌-కాకినాడ: ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది వరద ప్రవాహం ఉగ్ర రూపం దాల్చింది. అంతకంతకూ నీటిమట్టం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజి వద్ద గంట గంటకు పెరుగుతున్న వరద ఉధృతి చూస్తుంటే 1986 వరద పునరావృతం అవుతుందనే అనుమానం గోదావరి వాసులకు కలుగుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం, ఎగువ భద్రాచలం, కూనవరం, పోలవరం ప్రాంతాల్లో గోదావరి ప్రమాదస్థాయి మించి ప్రవహిస్తోంది. భద్రాచలంలో ప్రస్తుతం 63 అడుగులు నీటిమట్టం అంటే ప్రమాదస్థాయికి మించి 10 అడుగులకు పైగా నమోదై 26 లక్షలు క్యూసెక్కులు విడుదల చేయడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోయాయి. అలాగే గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతమైన కూనవరంలో 23 మీటర్లు నీటిమట్టం నమోదైంది. కాళేశ్వరం 16.610 మీటర్లు నీటిమట్టం ఉండగా అదే సమయంలో 28లక్షలు క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. అంటే కాళేశ్వరం నుంచి వరద నీటి ప్రవాహం 30 గంటల్లో భద్రాచలం చేరుతుంది. అక్కడ నుంచి వచ్చే భారీ వరద 18 గంటల్లో ధవళేశ్వరం బ్యారేజికి వస్తుంది. దీంతో గురువారం రాత్రికే ధవళేశ్వరం బ్యారేజి వద్ద మూడో ప్రమాద హెచ్చరికకు మించి వరద ప్రవహిస్తుంటుంది. అలా అయితే ఆరు జిల్లాల్లోని 42 మండలాల్లో 524 గ్రామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని ఎనిమిది మండలాలు, అంబేద్కర్ కోనసీమలో 20 మండలాలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని 4 మండలాలు, ఏజెన్సీ మండలాలతో ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఐదు మండలాలతో పాటు కాకినాడ జిల్లాల్లోని రెండు మండలాలు, ఏలూరు జిల్లాలోని మూడు మండలాలపై వరద ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సంబంధిత జిల్లాలు, మండలాలు, అధికారులు అప్రమత్తంగా ఉండాటంటూ రాష్ట్ర విపత్తుల నిర్వహణా సంస్థ ప్రకటించింది. అలాగే గోదావరీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా

- మిగతా 2 లో

ఆగని రూపాయి
గింగిరాలు

రికార్డ్ స్థాయికి పతనం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు మరింత క్షీణిస్తోంది. గురువారం ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్ ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ చరిత్రలో తొలిసారి 80కి చేరువైంది. ఇంట్రా డే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి 79.72 వద్ద ప్రారంభమై 79.71కి చేరుకుంది. తిరిగి 79.92 పాయింట్ల ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకున్నది. బుధవారం ట్రేడింగ్‌తో పోలిస్తే గురువారం ట్రేడింగ్‌లో తొమ్మిది పైసలు నష్టపోయి.. మార్కెట్

- మిగతా 2 లో

అద్దె గర్భానికీ ప్రసూతి సెలవు
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో‌-అమరావతి: అద్దెగర్భం (సరోగసీ) ద్వారా బిడ్డను తీసుకున్న తల్లికి మెటర్నరీ సెలవు మంజూరు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పెదనందిపాడు మండలం ఉప్పలపాడు హైస్కూల్‌లో పని చేసే టీచర్‌కు మెటర్నరీ లీవ్ ఇవ్వకపోవడంపై ఆమె కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు, మెటర్నిటీ లీవ్ ఇవ్వాల్సిందేనని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. సరోగసీ ద్వారా బిడ్డకు జన్మనిచ్చినప్పటికీ, ఆ తరువాత ఆ బిడ్డకు అండం ఇచ్చిన తల్లికీ మెటర్నిటీ లీవ్ ఇవ్వాల్సిందేనని హైకోర్టు సూచించింది. అలాగే బిడ్డను పెంచేందుకు తల్లికి మూడు నెలల పాటు మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని ఆదేశించింది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ 2017కు తెచ్చిన సవరణల ద్వారా సెలవు ఇవ్వాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది.

ఎట్టకేలకు గొటబాయ రాజీనామా 8 లో

ఇదీ లోకం!

మంత్రుల నుంచి విన్నపం సార్! ఈ గతుకుల రోడ్లమీద ప్రయాణించలేరట.

రష్యా అమ్ములపొదిలో 'బెల్గొరోడ్'

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న సమయంలో రష్యా అత్యంత శక్తిమంతమైన జలాంతర్గామిని నావికాదళంలో ప్రవేశపెట్టింది. ఈ ఆయుధం సముద్రంలోని అత్యంత లోతుల్లో రహస్యంగా ఉండగలదు. అదే 'కే-329 బెల్గొరోడ్'. అణ్వాయుధాలతో కూడిన అండర్ వాటర్ డ్రోన్లను వేల మైళ్ల దూరానికి మోసుకెళ్లడం ఈ సబ్‌మెరైన్ ప్రత్యేకత. ప్రపంచంలో ఇప్పటివరకూ ఇదే అత్యంత బరువైన. పొడవైన సబ్‌మెరైన్. ఈ జలాంతర్గామిలో మొత్తం ఆరు పొసెయిడన్ న్యూక్లియర్ ఆర్మ్‌డ్ టోర్పెడోలు ఉన్నాయి. శత్రు దేశ తీరాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ జలాంతర్గామి నుంచి ఒక్క టోర్పెడోను ప్రయోగిస్తే.. శత్రు దేశ తీరమంతా రేడియో ధార్మికతతో నిండిపోతుంది. దీంతో శత్రు దేశంలో అపార ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుంది. 2027నాటికి ఇలాంటివే మరో రెండు జలాంతర్గాములను తీసుకురావడానికి రష్యా ప్రయత్నిస్తున్నది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న ఈ సమయంలో రష్యా ఈ తరహా సబ్‌మెరైన్‌ను ప్రయోగిస్తే.. రేడియోధార్మిక సునామీనే అని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 24వేల టన్నుల బరువు, 604 అడుగుల పొడవు, గంటకు 59కిలోమీటర్ల వేగంతో ఉన్న ఈ జలాంతర్గామి ప్రపంచంలోనే భారీ ఆయుధం. సముద్రంలో అత్యంత లోతుల్లో ఉండే కేబుల్స్‌న ధ్వంసం చేసేందుకు దీనిని వినియోగిస్తారు. ఈ సబ్‌మెరైన్ సైంటిఫిక్ రీసెర్చిలకు, లోతైన ప్రదేశాల్లో రెస్క్యూ ఆపరేషన్‌కు తోడ్పడుతుంది. ఈ ఆయుధాన్ని రష్యా ప్రతిదాడికి మాత్రమే వినియోగిస్తుంది. దీనిని తీర ప్రాంతాల్లో నగరాలు, పారిశ్రామిక ప్రాంతాలు, సముద్రంలోని క్యారియర్ బ్యాటిల్ గ్రూప్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగిస్తారు.

ప్రధాని పదవి రేసులో సునాక్ ముందంజ

లండన్: బ్రిటన్‌లో అధికార కన్సర్వేటివ్ పార్టీ అధ్యక్షుడు, బ్రిటన్ మాజీ ఆర్థిక మంత్రి, భారత సంతతి వ్యక్తి రిషి సునాక్ బ్రిటన్ ప్రధానమంత్రి రేసులో ముందంజలో ఉన్నారు. బుధవారం జరిగిన మొదటి రౌండ్ ఓటింగ్‌లో కన్సర్వేటివ్ ఎంపీల ఓట్లలో సునక్‌కు అత్యధికంగా 88 ఓట్లు వచ్చాయి. 67 ఓట్లతో వాణిజ్య శాఖ మంత్రి పెన్నీ మోర్డాంట్, 50 ఓట్లతో విదేశాంగ మంత్రి లిజ్ ట్రజ్ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మాజీ మంత్రి కెమీ బదోనెచ్‌కు 40ఓట్లు, టామ్ టుగేన్‌ధాట్‌కు 37ఓట్లు, భారత సంతతికి చెందిన అటార్నీ జనరల్ సుయోలా బ్రావెర్మన్‌కు 32ఓట్లతో చివరి స్థానంలో నిలిచారు. ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేయటంలో ద్రవ్యోల్బణం కట్టడికే తొలి ప్రాధాన్యత ఇస్తానని సునాక్ పేర్కొన్నారు. కఠిన సవాళ్లను ఎదుర్కోవటంలో తనకు అపార అనుభవం ఉందని, ప్రస్తుత సమయంలో దేశాన్ని ముందుకు నడిపించగలనని ధీమా వ్యక్తం చేశారు. తాను ప్రజలను వారి బ్యాంకు ఖాతాల ద్వారా కాకుండా వారి ప్రవర్తనను భట్టి అంచనా వేస్తానని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సమస్యలపై ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'కరోనా మహమ్మారితో లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారని అది దేశాన్ని ఓ మెట్టు వెనక్కి లాగుంతుందని ముందుగానే ఊహించామని అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపడితే ద్రవ్యోల్బణం కట్టడికే తొలి ప్రాధాన్యతగా పేర్కొన్నారు.

హంగేరిలో అత్యవసర పరిస్థితి

బుడాపెస్ట్: హంగేరి ప్రభుత్వం ఇంధన అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రతకు సంబంధించి 7-పాయింట్ల ప్రణాళికను అమలు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయ అధిపతి గెర్గెలీ గులియాస్ తెలిపారు. ఈ చర్యలు ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తాయి. ఉక్రెయిన్ యుద్ధం, రష్యాపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షలు, ఐరోపాలో ఇంధన సంక్షోభానికి కారణమని గులియాస్ ఆరోపించారు, దేశ అత్యవసర ప్రణాళికలో భాగంగా, దేశీయ సహజ వాయువు ఉత్పత్తి 2 బిలియన్ క్యూబిక్ మీటర్లకు రెట్టింపు చేయనున్నారు. అదనపు గ్యాస్ సరఫరాలపై చర్చలు జరి పేందుకు ప్రభుత్వం విదేశాంగ మంత్రికి బాధ్యతలు అప్ప గించింది. ఇదే సమయంలో, ప్రభుత్వం ఇంధన వాహ కాలైన కట్టెల ఎగుమతిని నిషేధించింది. దేశీయ లిగ్నైట్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ప్రకటించింది.బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌ను వీలైనంత త్వరగా పునఃప్రారంభించనున్నారు. పాక్స్ అణు విద్యుత్ ప్లాంట్ నిర్వహణ లైసెన్స్‌ను 2042-2047 వరకు పొడిగించనుంది.విద్యుత్ సగటు వార్షిక వినియోగం 2,523 కిలోవాట్ గంటలు, గ్యాస్ 1,729 క్యూబిక్ మీటర్లుగా ప్రభుత్వం ప్రకటించింది. హంగేరిలో ద్రవ్యోల్బణం 12 శాతానికి చేరుకుంది, ఇది 24 సంవత్సరాల గరిష్టాన్ని తాకింది.

అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు

బీజింగ్: ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అమెరికా విధానాలను ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్బిన్ పేర్కొన్నారు. అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ ఇతర దేశాలలో తిరుగుబాట్లు ప్రణాళికలను రూపొందిచడంపై పత్రికలు అడిగిన ప్రశ్నలకు పై విధంగా స్పందించారు. విదేశాలలో అంతర్గత యుద్ధాలకు మాజీ సీనియర్ అధికారుల ప్రమేయంలో ఆశ్చర్యం లేదని వాంగ్ అన్నారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, ఇతర దేశాల్లో అరాచకాలను సృష్టించడం, పాలనలను పడగొట్టడం అమెరికా ప్రభుత్వ "ప్రవర్తనా నియమావళి"గా మారిందని, దీనిని ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారని పేర్కొన్నారు.

పార్లమెంటులో ఆ పదాలు నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

వాడిన వ్యక్తిపై చర్యలు తీసుకునే అవకాశముంది. కాగా, ఏ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలన్న అధికారం ఉభయ సభాపతులకు ఉంటుంది. జులై 18 నుంచి ఆగస్టు 12 వరకు పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్న విషయం విదితమే.

ఇవి కొత్త సిఫార్సులు కాదు

ప్రతిపక్షాల మండిపాటు క్రమంలో ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ ఇవేమీ కొత్త సిఫార్సులు కాదని, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభల్లో వాడకూడదని నిర్దేశించినవేనని సమర్థించుకునే ప్రయత్నం చేశాయి. కామన్‌వెల్త్ దేశాల్లో అన్‌పార్లమెంటరీగా పరిగణించే పదాలూ ఈ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నాయి. వాస్తవాలు తెలియకుండా విపక్షాలు రభస చేస్తున్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఈ జాబితా ప్రతి ఏడాది వెలువడుతుందని అన్నారు. యూపీఏ హయాంలోనూ ఇందులో చాలా పదాలు 'అన్‌పార్లమెంటరీ'గానే పరిగణించారని చెప్పారు.

సభ్యుల హక్కులు హరించలేదు: స్పీకర్ ఓం బిర్లా

పార్లమెంటులో మాట్లాడేందుకు వినియోగించే పదాల్లో ఏ పదాన్ని ఉపయోగించకుండా నిషేధించ లేదని, కొన్ని పదాలను మాత్రమే తొలగించామని, తొలగించిన పదాల సంకలనం మాత్రమే జారీ చేశామని, సభా సౌలభ్యాన్ని కొనసాగిస్తూ సభ్యులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించ వచ్చని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. గతంలో అన్‌పార్లమెంటరీ పదాలను పుస్తకం రూపంలో విడుదల చేసేవారు. ఇప్పుడు ఇంటర్నెట్‌లో పెట్టామన్నారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే హక్కును ఎంపీల నుంచి ఎవరూ హరించలేదని అన్నారు. పార్లమెంటరీ పద్ధతులపై అవగాహన లేని వారు విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఉపయోగించే పదాలను మాత్రమే తొలగించలేదని, వాటిని అధికార పక్షం వారూ వినియోగిస్తున్నారని బిర్లా తెలిపారు. నిషేధిత పదాలంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని విపక్షాలనుద్దేశించి అన్నారు.

గోదావరి మహోగ్రరూపం

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని సూచించారు. గోదావరి ఉప్పొంగుతుండటంతో ఎగువ నుంచి గంట గంటలకు వరద ప్రవాహం ధవళేశ్వరం క్యాటన్ బ్యారేజి వస్తుండటంతో గోదావరి దిగువన ఉన్న కోనసీమ ప్రాంతవాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే లంక గ్రామాలకు రాకపోకలకు పూర్తిగా లేకుండా పోయాయి. కోనసీమ పరిధిలోని లంక ప్రాంతాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. రాజమహేంద్రవరం నగర పరిధిలోగల కేతావారి లంక, బ్రిడ్జిలంక ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. సీతానగరం మండలంలోని ములకల్లంకను వరద చుట్టుముట్టింది. విజ్జేశ్వరం నుంచి ఇసుక తవ్వే బోట్లను రప్పించి లంక వాసులు రాకపోకలకు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని గురువారం మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్, రాజానగరం ఎమ్మెల్యే రాజా పరిశీలించారు. అలాగే నిడదవోలు, పెరవలి మండలాల్లో పల్లపు లంక భూముల్లోకి వరద నీరు చేర డంతో పూలతోటలు, ఉద్యాన పంటలకు ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతు న్నారు. కొవ్వూరు మండలం మద్దూరు లంకకు ముంపు ముప్పు ఎదురవగా.. గ్రామంతో పాటు గట్ల పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. కడియం మండల పరిధిలోని కడియపు లంక, పొట్టిలంక, బుర్రి లంక శివారు ప్రాంతాల్లోని ఉద్యాన పంటలు, నర్సరీ మొక్కలు నీటమునగడంతో నర్సరీ రైతులు కూడా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఏటిగట్లు బలహీనంగా ఉండటం, భారీ వరద ప్రవాహంతో ముప్పు పొంచి ఉందని అధికారులు కూడా భావిస్తున్నారు. గురువారం ధవళేశ్వరం సర్‌ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 16.00 అడుగులు. ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 16,42,665 లక్షల క్యూసెక్కులు ఉంది. కాలవలు ద్వారా 3700 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

భద్రాచలం వద్ద 61.90 అడుగులు నీటిమట్టం

భద్రాచలం వద్ద గోదావరిలో 19.04లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం మూడో ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. భద్రాచలం వద్ద ప్రవాహం 61.80 అడుగులకు చేరింది. 1976 నుంచి నది 60 అడుగుల మార్క్‌ను దాటడం ఇది ఎనిమిదోసారి. వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా గురువారం సాయంత్రం 5 గంటల నుంచి వంతెనను మూసివేశారు. భారీ వరద నేపథ్యంలో వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో పాటు భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ ప్రకటించారు. అయితే, భద్రాచలం వంతెన చరిత్రలో రాకపోకలు నిలిపివేయడం ఇది రెండోసారి. 1986లో నీటిమట్టం 75.6 అడుగులకు చేరిన సమయంలో రాకపోకలను నిలిపివేశారు. మళ్లీ 36 సంవత్సరాల భారీగా వరద వస్తుండడంతో ఆంక్షలు విధించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆంక్షలు అమలులోకి రాగా.. 48 గంటల పాటు కొనసాగనున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాకపోకలు నిలిచిపోయాయి.

మద్య నిషేధం హుళక్కే!

(మొదటిపేజీ తరువాయి)

నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 35 లక్షలు, 5 లక్షలు పైబడి జనాభా ఉన్న ప్రాంతానికి రూ.10 లక్షలు, అప్లికేషన్ ఫీజు, ఏడాదికి నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీ రూ.50 లక్షలుగా నిర్ణయించారు. బార్లలో దయం 11 గంటల నుంచి రాత్రి 11 వరకు మద్యం అమ్మకానికి అనుమతి ఉంటుందని, త్రీ స్టార్ హోటల్స్‌లో అయితే ఉదయం 11 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకానికి అనుమతి ఇస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఆగని రూపాయి గింగిరాలు

(మొదటిపేజీ తరువాయి)

ముగిసే సమయానికి 79.90 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ బలోపేతం కావడం, దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం దీనికి కారణంగా విశ్లేషకులు చెపుతున్నారు. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్స్ ధర బ్యారెల్‌పై 2.20 శాతం తగ్గి 97.38 డాలర్లకు పడిపోయింది. దేశీయ స్టాక్ మార్కెట్లలో బీఎస్ఈ 98 పాయింట్లు నష్టపోయి 53,416.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 28 పాయింట్ల పతనంతో 15,938.65 పాయింట్ల వద్ద స్థిర పడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ల నుంచి రూ.2,839.52 కోట్ల విలువైన నిధులు ఉపసంహరించుకున్నారు.

అవునా.. ఆ పదాలు అమర్యాదకరమా..!!

- ప్రతిపక్షాల ఎద్దేవా - భావ ప్రకటన స్వేచ్ఛ హరణ ఆరోపణ
- బయట పడ్డ మోదీలోని భయం: విపక్షాలు
- నవ భారతానికి నూతన నిఘంటువు: కాంగ్రెస్
- సభలో అన్నీ వాడతాం.. సస్పెండ్ చేస్తే చేయండి: టీఎంసీ
- వాహ్ మోదీజీ తప్ప ఏమీ అనరాదా..: శివసేన

న్యూఢిల్లీ: 'అన్‌పార్లమెంటరీ' పదాలపై కొత్త బుక్‌లెట్ గురువారం వివాదానికి దారితీసింది. మోదీ ప్రభుత్వ వాస్తవికతను వివరించడానికి తాము వాడే పదాలను 'నిషేధిత' జాబితాలో చేర్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ ఎంపీలపై 'గాగ్ ఆర్డర్'ను కాంగ్రెస్, టీఎంసీ, శివసేన పార్టీలు దుయ్య బట్టాయి. ఈ జాబితా నవభారతానికి నూతన నిఘంటువు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించగా అవినీతికి పాల్పడితే అవినీతిపరుడు అంటే ఉలుకెందుకు అని టీఎంసీ, శివసేన నేతలు ఎద్దేవా చేశారు. మోదీలోని భయం బయటపడిందని 'అన్‌పార్లమెంటరీ బుక్‌లెట్'ను ద్దేశించి విపక్షాలు పేర్కొన్నాయి. 'జుమ్లాజీవి, బైల్ బుద్ధి, కోవిడ్ స్ప్రెడర్, స్నూప్‌గేట్‌తో పాటు సాధారణంగా వినియోగించే 'అషేమ్డ్, అబ్యూస్డ్, బిట్రేయల్, కరప్ట్, డ్రామా, హిపోక్రసీ, ఇన్‌కంపెటెంట్' వంటి పదాలనూ 'అన్‌పార్లమెంటరీ'గా పేర్కొంటూ పార్లమెంటు ఉభయ సభల్లో వీటి వాడకాన్ని నిషేధించారు. వీటిలో అన్‌పార్లమెంటరీ ఏమీ లేదని, వాటిని నిషేధించడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అని విపక్షాలు మండిపడ్డాయి.విమర్శలను తట్టుకోలేకనే ఇలా చేశారంటూ దుయ్యబట్టాయి.

నవ భారతానికి నవ నిఘంటువు అంటూ ట్విట్టర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ విమర్శించారు. అన్‌పార్లమెంటరీ అంటే 'ప్రభుత్వ పరిపాలన, ప్రధాని పనితీరును సరిగ్గా వివరించేందుకు చర్చల్లో వినియోగించే పదాలు.. వాటిని పలకకుండా ఇప్పుడు నిషేధం విధించారు' అని వ్యాఖ్యా నించారు. అన్‌పార్లమెంటరీ వాక్యానికి ఉదాహరణ 'తన అబద్ధాలు, అసమర్థత బయట పడినప్పుడు జుమ్లాజీవి తానాషా మొసలి కన్నీరు కార్చారు' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'మోదీ ప్రభుత్వ వాస్తవికతను వర్ణించేందుకు ప్రతిపక్షాలు వినియోగించే పదాలన్నీ 'అన్‌పార్లమెంటరీ'. తదుపరి ఏమిటి విశ్వగురు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానిం చారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఓ ట్వీట్ చేశారు. అందులో 'పార్లమెంటులో ఇలాంటి పదాలను వాడకుడదు అంటూ ప్రభుత్వం నిషేధం విధించి ఉండవచ్చు గానీ ఎల్పీజీ, నిత్యావసరాల అధిక ధరలు, నిరుద్యోగం, అగ్నిపథ్‌పై భారత ప్రజలకు సమాధానం చెప్పక తప్పదు. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో వీటన్నింటిపై గళం వినిపించబోతున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలు మరికొన్ని రోజులలో మొదలు కానున్న క్రమంలో ఎంపీలపై గాగ్ ఆర్డర్ జారీ అయిందని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓ బ్రైన్ అన్నారు. 'పార్ల మెంటులో మాట్లాడేటప్పుడు సాధారణ పదాలను కూడా వాడేందుకు మాకు అనుమతి లేదన్నమాట. నేను ఈ పదాన్నీ వాడుతాను. నన్ను సస్పెండ్ చేయండి. ప్రజాస్వా మ్యం కోసమే పోరాటం' అంటూ డెరెక్ పేర్కొన్నారు. వాహ్ మోదీజీ వాహ్ తప్ప ఏమీ మాట్లాడేందుకు.. చేసేందుకు అనుమతి లేదంటూ శివసేన నేత ప్రియాంక చతుర్వేది ట్వీట్ చేశారు. అసలు ఇలా చేయడం వెనుక మోదీ ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా నిలదీశారు. 'ఓ వ్యక్తి అవినీతికి పాల్పడితే అతనిని అవినీతిపరుడు అనకూడదా..! అవినీతిని 'మాస్టర్ స్ట్రోక్' అనాలా..! రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు వంటి జుమ్లాలకు కృతజ్ఞతలు చెప్పాలా! అని హిందీలో ట్వీట్ చేశారు. పార్లమెంటులో అన్నదాతలను ఆందోళనజీవి అన్నది ఎవరో అంటూ ప్రధాని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా స్పందిస్తూ 'సాహెబ్‌కు తన లక్షణాలన్నీ బాగా తెలుసు' అని దుయ్యబట్టారు.

ఇవి కొత్త సిఫార్సులు కాదు: ప్రభుత్వ సమర్థింపు

ప్రతిపక్షాల మండిపాటు క్రమంలో ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ ఇవేమీ కొత్త సిఫార్సులు కాదని, లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభల్లో వాడకూడదని నిర్దేశించినవేనని సమర్థించుకునే ప్రయత్నం చేశాయి. కామన్‌వెల్త్ దేశాల్లో అన్‌పార్లమెంటరీగా పరిగణించే పదాలూ ఈ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నాయి. వాస్తవాలు తెలియకుండా ప్రతిపక్షాలు రభస చేస్తున్నాయని ఓ అధికారి వ్యాఖ్యానించారు. ఈ జాబితా ప్రతి ఏడాది వెలువడుతుందని అన్నారు. యూపీఏ హయాంలోనూ ఇందులో చాలా పదాలు 'అన్‌పార్లమెంటరీ'గానే పరిగణించారని చెప్పారు.

11 నుంచి 17 వరకు ఇంటింటా మువ్వన్నెల జెండా ఎగరాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆగస్టు 11 నుంచి 17వ తేదీ వరకూ రాష్ట్రంలో ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ పిలుపు నిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్స రాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి) కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై గురువారం సచివాలయం మొదటి బ్లాకులో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరముందన్నారు. ప్రతి ఇంటా మువ్వన్నెల జెండాపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేకంగా లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించేలా తగిన చర్యలు తీసుకోవాలని సమాచారశాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిని ఆదేశించారు. ప్రధాన నగరాలు, పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అంతకు ముందు ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ 20-30 అంగుళాల సైజుతో కూడిన మువ్వన్నెల జెండా ఎగురవేయాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్, ముఖ్య కార్యదర్శులు గోపాల కృష్ణ ద్వివేది, అనిల్ కుమార్ సింఘాల్, వాణి మోహన్, కార్యదర్శి జీఎస్ఆర్కెఆర్ విజయ కుమార్, సెర్ప్ సీఈవో ఇంతియాజ్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షులు హేమచంద్రా రెడ్డి , వైద్య ఆరోగ్యశాఖ, టీఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సమాచార శాఖ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు.

రూ.21వేలకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

అలానే ఉంచాలనే డిమాండ్‌కు సీఎం జగన్ అంగీకరించారని తెలిపారు. అందువల్ల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 6వేల రూపాయలు యథాతథంగా ఉంటుంది. జీతంతో పాటు, 6 వేలు కలిపి రూ. 21 వేలు వారికి అందించాలని నిర్ణయం తీసుకున్నాం. రాబోయే రోజుల్లో కూడా ఈ ఆక్యుపేషనల్ అలవెన్స్ కొనసాగిస్తాం. మున్సిపల్ ఉద్యోగులు సమ్మె విరమించాలని మంత్రి ఆదిమూలపు సురేష్ కోరారు.

సమ్మెను బలహీనపర్చడానికే : సుబ్బారాయుడు

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించకుండా సమ్మె విరమించాలని కోరడం ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలో భాగమేనని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నాడు-నేడు పనుల్లో రాజీలేదు: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మన బడి, నాడు-నేడు రెండో దశలో భాగంగా పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలని, పనుల్లో ఎలాంటి రాజీకి తావులేదని విద్యాశాఖామంత్రి బొత్స సత్యనా రాయణ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి మన బడి, నాడు-నేడు పనుల తీరుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ఎస్.సురేశ్ కుమార్, పాఠశాల విద్యా సలహాదారు (ఇన్ఫ్రా), ఎ.మురళీ, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎస్.దీవెన్‌రెడ్డి తదితర అధికారులు హాజరయ్యారు. మంత్రి బొత్స మాట్లాడుతూ... రెండో దశ మన బడి, నాడు-నేడు పనుల కింద 22344 పాఠశాలలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా, 20757 పాఠశాలల వివరాలను నాడు-నేడు ఎస్టీఎంఎస్ (స్కూల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాని టరింగ్ సిస్టం) అంతర్జాలంలో ఉంచామన్నారు. మొత్తం 22344 పాఠశాలల్లో పనులను పదిరోజుల్లో 100 శాతం ప్రారంభించాలని, నాడు-నేడు పనుల కోసం నిధుల కొరత లేదని చెప్పారు. జిల్లాల కలెక్టర్లతో మంత్రి నాడు-నేడు రెండో దశ పనుల తీరుపై, ఎదుర వుతున్న సమస్యలపై మంత్రి అడిగి తెలుసుకున్నారు. పనులు సకాలంలో పూర్తి చేస్తూ విజయ వంతం చేయడానికి కలెక్టర్ల పర్యవేక్షణలో మిగతా అధికారులు కూడా పూర్తి సమన్వయంతో పనిచేసి ఫలి తాలను సాధించాలన్నారు. స్టాకు పాయింట్లకు చేరిన ఇసుకను సంబంధిత పాఠశాలలకు తరలించాలని సూచించారు.

మాపై ఎందుకింత నిర్లక్ష్యం?

(మొదటిపేజీ తరువాయి)

నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయమని మాత్రమే కోరుతున్నామని, అవి కూడా మూడేళ్లు ఓపిక పట్టి అనివార్య పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని నేతలు పేర్కొన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో కార్మికులకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు అందరికీ పీఆర్‌సీ ద్వారా వేతనాలు పెంచినప్పటికీ మున్సిపల్ కార్మికుల సేవలను ప్రత్యేక దృష్టితో చూడాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు ఉద్యోగులు అందరితోపాటు పీఆర్‌సీ రూ.3వేలు పెంచి, హెల్త్ అలవెన్సులు రూ.6వేలు కోత పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. అకాల వర్షాలతో రాష్ట్రంలో వరదలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, అంటురోగాలు ప్రబలకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను దృష్టిలో పెట్టుకుని కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 'మున్సిపల్ కార్మికుల సమస్యలు విన్నాను, నేను ఉన్నాను' అన్న ముఖ్యమంత్రికి నాలుగు రోజులుగా వారు సమ్మె చేస్తున్నా కనిపించడం లేదా.. అని ప్రశ్నించారు. కార్మికులను బెదిరించడం మానుకుని, వారి న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని, లేకపోతే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) కన్వీనర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలుగజేసుకుని కోతలు లేని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు గొంతెమ్మ కోర్కెలు, కొత్త కోర్కెలు ఏమీ కోరడం లేదని, కోతలు లేని వేతనాల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కార్మికులకు ప్రభుత్వం ఎందుకు కనీస వేతనాలు ఇవ్వటంలేదని, నాలుగు రోజులుగా రోడ్డెక్కి పోరాటం చేస్తున్నా సానుకూలంగా స్పందించటంలేదన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి మున్సిపల్ కార్మికులను సచివాలయానికి పరిమితం చేస్తున్న ప్రభుత్వం, సచివాలయ సిబ్బందిలాగే వారిని కూడా ఎందుకు రెగ్యులరైజ్ చేయటంలేదని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బందిని రెండేళ్లకే రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం మూడు, నాలుగు దశాబ్దాలుగా విశేష సేవలు అందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ కార్మికులను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో విశేష సేవలు చేసిన మున్సిపల్ పారిశుధ్య, ఇతర కార్మికులకు దండలు వేసి, సన్మానాలు చేసిన ప్రభుత్వం, ఇప్పుడు వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రాకపోవటం ఏవిధంగా న్యాయమని నిలదీశారు. మాటతప్పను, మడమ తిప్పను అని చెప్పుకునే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రతి కార్మికునికి రూ.21వేలు వేతనం ఇవ్వాలన్నారు. వాగ్దానాలు, జీవోలు అమలు చేయకుండా సమ్మెలో ఉన్న వేలాది మంది కార్మికులను బెదిరించటం దుర్మార్గమన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సలహాదారులు నెక్కంటి సుబ్బారావు, రాష్ట్ర నాయకులు ఆసుల రంగనాయకులు, జేమ్స్, సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, సీఐటీయూ నగర నాయకులు డేవిడ్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో...

మచిలీపట్నంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు అర్ధనగ్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పారిశు ద్ధ్య కార్మికులపై చిన్నచూపు చూస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు మోదుమూడి రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరపాటి సత్యనారాయణ, యర్రంశెట్టి ఈశ్వరరావు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు కె.రాజారావు, సీఐటీయూ నాయకుడు బుర్రా సుబ్రహ్మణ్యం, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో అర్ధనగ్న ప్రదర్శన

మున్సిపల్ కార్మికుల రాష్ట్రవ్యాపిత సమ్మెలో భాగంగా ఇబ్రహీంపట్నంలో కార్మికులు ఐదు కిలోమీటర్లకు పైగా వినూత్నంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పెర్రిలో ఉన్న మున్సిపల్ సబ్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన పురవీధుల గుండా తిరిగి రింగ్ సెంటరుకు చేరుకుని గాంధీ బొమ్మ సెంటరులో సభ నిర్వహించారు. ఏఐటీ యూసీ ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వర రావు కార్మికులకు సంఘీభావం తెలియజేసి ప్రదర్శన, సభలో పాల్గొన్నారు. గుడివాడ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఏఐటియుసి నాయకుడు గూడపాటి ప్రకాశ్‌బాబు, సీఐటీయూ నాయకుడు ఆర్‌సీసీ రెడ్డి తదితరులు పాల్గొ న్నారు. జగ్గయ్యపేట, నందిగామ, వైఎస్సార్ తాడిగడప మున్సిపల్ కార్యాలయాల వద్ద కూడా కార్మికులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఏలూరులో సమ్మె ఉద్రిక్తం

మున్సిపల్ కార్మికుల సమస్య పరిష్కారానికి చేస్తున్న సమ్మెకు సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ మద్దతు ప్రకటించారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 4వ రోజు ఏలూరు జిల్లాలో ఉద్రిక్తంగా మారింది. ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పుప్పాల కన్నబాబును పోలీ సులు అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకోవడంతో విరమించారు. నూజివీడులో సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వ రరావు, నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఇందుపల్లి సత్య ప్రకాష్ పాల్గొ న్నారు. జంగారెడ్డిగూడెంలో సరిహద్దు ప్రాంతమైన తెలంగాణ నుంచి కార్మికులను తీసుకువచ్చి పనిచేయిస్తున్న సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నవ కృష్ణ చైతన్య అడ్డుకోవడంతో పోలీసులకు చైతన్యకు మధ్య తోపులాట జరగడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. చింతలపూడిలో సీపీఐ సీనియర్ నాయకులు ఎం వసంతరావు, మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తుర్లపాటి బాబు పాల్గొన్నారు. కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిం చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు చెల్లబోయిన రంగారావు, రాష్ట్ర కోశాధికారి కె.మల్లేశ్వరరావు, తణుకులో సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, నరసాపురంలో ఏఐటీయూసీ పట్టణ నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్, పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి సోమసుందర్ పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మండల నాగేశ్వరరావు మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

తూర్పుగోదావరి జిల్లాలో

కాకినాడలో శారదా దేవి గుడి వద్ద నుంచి మున్సిపల్ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్ర మంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దాస్ పాల్గొన్నారు. నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ భాస్కరరావు అధ్యక్షత వహించారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉప్పలపాటి చంద్రదాసు విచ్చేశారు. అమలాపురంలో ఏపీ మున్సిపల్ జేఏసీ తరఫున కె సత్తిబాబు పాల్గొన్నారు.

గుంటూరులో

మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె గుంటూరులో నాలుగవ రోజు విజయవంతం జరిగింది. గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి సీపీఐ, టీడీపీ, జనసేన పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నజీర్ అహ్మద్, జనసేన పార్టీ నాయకులు ఆళ్ల హరి కార్మికులను ఉద్దేశించి ప్రసంగిం చారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మోకాళ్ళపై నిల్చుని అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కోట మాల్యాద్రి, బందెల రవికుమార్, ఈదులమూడి మధుబాబు, ముత్యాలరావు, సోమి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గగానే శరవేగంగా పోలవరం

- ఆగస్టులో నెల్లూరు, సంగం బ్యారేజీలు ప్రారంభం
- దసరాకల్లా వెలుగొండ టన్నెల్‌-2
- జల వనరుల సమీక్షలో సీఎం జగన్‌ ఆదేశం
- నేడు ముంపు ప్రాంతాల్లో ఏరియల్‌ సర్వే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను వరద తగ్గగానే మరలా వేగవంతం చేయాలని, అనుకున్న సమయానికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌ రెడ్డి ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంప్‌ కార్యాలయంలో జల వనరుల శాఖ అధికారులతో సమీక్ష చేపట్టారు. పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలు, ముందస్తు వరదలపై వివరాలు అడిగి తెల్సుకున్నారు. ప్రాజెక్టులో ఈసీఆర్‌ఎఫ్‌డ్యాం నిర్మాణ ప్రాంతంలో గతంలో ఏర్పడ్డ గ్యాప్‌-1, గ్యాప్‌-2లు పూడ్చే పనుల గురించి ఆరా తీయగా, రెండు గ్యాప్‌లను పూడ్చే పనులను నిర్ధారించ డానికి 9 రకాల టెస్టులు, నివేదికలు అవసరమని, వరదల తగ్గిన తర్వాత ఈ పరీక్షలు పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. గోదావరిలో వరద కనీసంగా 2 లక్షల క్యూసెక్కులకు తగ్గితే గాని దిగువ కాఫర్‌ డ్యాం ప్రాంతంలో పనులు చేయడానికి అవకాశం ఏర్పడదని, ఆగస్టు మొదటివారంలో పనులు తిరిగి ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ పరిస్థితి రాగానే.. ముమ్మరంగా పనులు చేయడానికి అన్నిరకాలుగా సిద్ధం కావాలని అధికార యంత్రాగానికి సీఎం సూచించారు. కేంద్రం నుంచి మనకు రావాల్సిన నిధులు తెప్పించుకునే అంశంపై దృష్టిపెట్టాలని, లేఖలు కూడా రాయాలని సీఎం సూచించారు. అలాగే పోలవరం కుడి, ఎడమ కాల్వలకు సంబంధించి హెడ్‌ వర్క్స్‌, కనెక్టివిటీ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. ఆగస్టు మూడోవారంలో నెల్లూరు బ్యారేజీ, మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీల ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. బ్యారేజీపై పెట్టాల్సిన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి విగ్రహం కోసం ఎదురుచూస్తున్నామని, అది కూడా త్వరలో చేరుకుంటుందని తెలపగా, దసరా నాటికి వెలిగొండ టన్నెల్‌-2 సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని సీఎం స్పష్టం చేశారు. వంశధార ప్రాజెక్టు స్టేజ్‌-2 ఫేజ్‌-2 పనులు దాదాపుగా పూర్తికావచ్చాయని, అక్టోబరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని, అదే సమయంలో గొట్టా బ్యారేజీ నుంచి హిరామండలంకు నీరందించే ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన కార్యక్రమం చేపడతామని అధికారులు వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, మహేంద్రతనయ, తారకరామతీర్థసాగర్‌, గజపతినగరం బ్రాంచ్‌ కెనాల్‌, రాయలసీమలోని జొలదరాశి, రాజోలిబండ, కుందూ లిఫ్ట్‌, వేదవతి, ఆర్డీఎస్‌ ప్రాజెక్టులు, వీటితోపాటు చింతలపూడి, వైయస్సార్‌ పల్నాడు, మడకశిర బైపాస్‌ కెనాల్‌, బైరవానితిప్ప, వరికెశెలపూడి కలుపుకుని మొత్తం 27 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయడానికి లక్ష్యాలను సీఎం జగన్‌ నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, సీఎస్‌ సమీర్‌ శర్మ, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌ కుమార్‌, ఆర్థికశాఖ స్పెషల్‌ సీఎస్‌ ఎస్‌ ఎస్‌ రావత్‌, ఈఎన్‌సీ సి నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు సీఎం ఏరియల్‌ సర్వే

గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి జగన్‌ శుక్రవారం మధ్యాహ్నం ఏరియల్‌ సర్వే చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యవసాయానికి విద్యుత్‌ మీటర్లు

ఉచిత విద్యుత్తుకు మంగళం పాడేందుకే

రైతులతో కలిసి సీపీఐ పోరాటం

విశాలాంధ్ర-రాప్తాడు : వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్తు పథకానికి మంగళం పాడేందుకు మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని సీపీఐ నేతలు ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవరగుడి జగదీశ్‌, అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్‌, సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున తదితరుల బృందం గురువారం రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి గ్రామంలోని తోటల్లో పర్యటించారు. విద్యుత్‌ మీటర్లను పరిశీలించారు. రైతులు రామ్మోహన్‌ రెడ్డి, మిడతల ఉజ్జినప్పలతో మాట్లాడారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ...వ్యవసాయ మోటర్లకు మీటర్ల వద్దు అని రైతులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని సీఎం జగన్‌ మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉచిత విద్యుత్‌ను నిలిపివేసేందుకే ఈ చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. రైతులకు ఈ మీటర్లు ఉరితాళ్లుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల్లో తిరుగుబాటు రాకుండా నగదు బదిలీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఉచిత విద్యుత్తు పథకాన్ని ఎత్తివేసేందుకే ఈ కుట్రలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అప్పుల ఆశచూపి రైతులను ముంచేలా కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించిన అనంతరం రైతులకు నగదు బదిలీ ఆపేస్తే పరిస్థితి ఏమిటని నిలదీశారు. మీటర్లు బిగించేలా జారీ చేసిన జీఓ నంబరు 22ను ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. తక్షణమే మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో అన్నదాతలతో కలసి ఆందోళన బాటపడతామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శులు సాకే నాగరాజు, శ్రీకాంత్‌ విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలన్నింటికీ

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉన్నత పాఠశాలలన్నింటికీ ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలు, ప్రీ హైస్కూళ్లలో సిబ్బంది మార్పు నకు, వారానికి 36 పిరియడ్ల కేటాయింపునకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ తాజాగా విడుదల చేసిన జీవో 128లో వాటిని విస్మరిం చడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉత్తర్వులను సవరించాలని ఆయన డిమాండ్‌ చేశారు.

సీఎంను కలిసిన పదోన్నతి ఐఏఎస్‌లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి సీఎం క్యాంప్‌ కార్యాలయంలో సీఎం జగన్‌ను గురువారం పదోన్నతి పొందిన ఐఏఎస్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. డిప్యూటీ కలెక్టర్లు బి.సుబ్బా రావు- డీఆర్వో, తూర్పుగోదావరి, జే.శివ శ్రీనివాసు-అసిస్టెంట్‌ సెక్రటరీ సీసీఎల్‌ఏ, పి.శ్రీనివాసులు (డీఆర్వో, ప్రకాశం), బి. శ్రీనివాస రావు (సీఈవో, రైతుబజార్లు), ఆర్‌. గోవిందరావు (ఆర్డీవో, నర్సీపట్నం), ఎన్‌.తేజ్‌ భరత్‌ (జాయింట్‌ సెక్రటరీ, సీసీఎల్‌ఏ), డి.హరిత(ఆర్డీవో, శ్రీకాళ హస్తి), ఎస్‌.చిన్న రాముడు (స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌,ఎల్‌ఏ) సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

సీపీఐ బలోపేతమైతేనే ప్రజలకు మేలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ముప్పాళ్ల. పక్కన మారుతి వర ప్రసాద్‌, ఎస్‌.కె.హుస్సేన్‌ , పఠాన్‌లాల్‌ఖాన్‌ తదితరులు

విశాలాంధ్ర-వినుకొండ: భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ స్థాయి నుంచి దిల్లీ స్థాయి వరకు బలపడడం ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గోగినేని కల్యాణ మండపం కామ్రేడ్‌ పఠాన్‌ కాసింఖాన్‌ వేదికపై సీపీఐ ఏరియా పట్టణ 23వ మహాసభలు జరిగాయి. ముప్పాళ్ల మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌ రెడ్డి ఎన్నికల ముందు మద్య నిషేధంపై వాగ్దానాలు చేసి మహిళలను మభ్యపెట్టారని, నేడు ప్రభుత్వ పరంగా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. మద్యంపై ఆదాయాన్ని చూపి రుణం ఇవ్వాలంటూ ప్రాధేయపడటం సిగ్గుచేట న్నారు. గత ఎన్నికల్లో జగన్‌ మున్సిపల్‌ కార్మికులకు ఎన్నో వాగ్దానాలు చేసి నేడు సమ్మెబాట పట్టించాడని ముప్పాళ్ల విమర్శించారు. ఉపాధ్యా యులను కూడా మోసగించారని, అగ్రిగోల్డ్‌ బాధితులకు సహాయం చేయలేదని, సీపీఐ అధ్వర్యంలో భారీ ఉద్యమం ద్వారా బాధితులకు కొంత న్యాయం జరిగిందన్నారు. పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్‌ మాట్లాడుతూ... 2018లో పట్టణ మహాసభలు జరిగా యని, కరోనా మహమ్మారి కారణంగా నేటి వరకు ఆగిపోయాయని చెప్పారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేయడం జరిగిందని తెలిపారు. సహాయ కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్‌ మాట్లాడుతూ... పేద ప్రజలకు కూడు, నీడ, గుడ్డ కోసం పోరాటాలు సాగించేది ఒక్క సీపీఐ మాత్రమేనన్నారు. పట్టణ సీపీఐ కార్యదర్శి పఠాన్‌ లాల్‌ ఖాన్‌ మాట్లాడుతూ అనేక వార్డుల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవి పరిష్కరించే దిశగా పనిచేశామని తెలిపారు. జిల్లా ఏరియా పట్టణ సీపీఐ నేతలను, కార్యకర్తలను శాలువాలతో ఆయన ఘనంగా సత్కరించారు. పల్నాడు జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ విప్లవ గేయాలను ఆలపించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

తొలుత శివయ్య స్థూపం సెంటర్‌ సీపీఐ కార్యాలయం నుంచి కారంపూడి రోడ్‌లోని సభావేదిక వద్దకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహిళలు భారీఎత్తున పాల్గొ న్నారు. 23వ మహాసభలకు చిహ్నంగా రెడ్‌ షర్ట్‌ వలంటీర్లు 23 జెండాలతో అగ్రభాగాన నడవగా తీన్మార్‌ బ్యాండ్‌ వాయిద్యాలతో, కోలాటాలతో ప్రదర్శన ఆకట్టుకుంది. సీపీఐ నేతలు, కార్యకర్తలు భారీ బ్యానర్‌తో ప్రదర్శనలో పాల్గొ న్నారు. కారంపూడి రోడ్డంతా ఎర్రజెండాలతో రెపరెప లాడింది. సభా వేదిక వద్ద సీపీఐ సీనియర్‌ నాయకులు, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ సంద్రపాటి సైదా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే అమరవీరుల స్మారక స్థూపం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు సంద్ర పాటి సైదా అధ్యక్షత వహించారు. సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు నేతలను వేదిక పైకి ఆహ్వానించారు. తొలుత కమ్యూనిస్టు ఉద్యమ నేత పులుపుల వెంకట శివయ్య 46వ వర్ధంతి సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు పులుపుల ఫోటోకు పూలమాల వేసి నివాళు లర్పించారు. పులుపుల శివయ్య స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ ఈపూరు మండల కార్యదర్శి ఓట్ల రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు కె.చిన్న సుభాని, నూజెండ్ల సీపీఐ మండల కార్యదర్శి ఏ.పవన్‌ కుమార్‌, ఈపూరు మండల కార్యదర్శి ఎస్‌.బ్రహ్మం, బి.సాగర్‌, ఆర్‌.వందనం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు.

తరగతుల విలీనంతో

మారుమూల పాఠశాలలు కనుమరుగు

విద్యాశాఖ సంయుక్త సంచాలకులకు ఎస్టీయూ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2022 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల భవిష్యత్తులో మారుమూల గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగై, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాద ముందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌.సాయిశ్రీనివాస్‌, హెచ్‌.తిమ్మన్న విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నంలోని విద్యాశాఖ కమిషనర్‌ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగంను కలిసి సమస్యలపై చర్చించి, వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వులు-117, 128 సవరించా లన్నారు. ఫౌండేషన్‌ ప్లస్‌ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఇద్దరు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు, ఒక ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుని పోస్టు ఖచ్చితంగా కేటాయించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విలీనం చేయడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులు, రద్దీ రహదారులను విద్యార్థులు దాటాల్సిన చోట విలీనంపై పున:సమీక్షించాలని కోరారు. ప్రీ హైస్కూళ్లలో కేవలం స్కూల్‌ అసిస్టెంట్లనే కేటాయించాలని, ప్రతి ప్రీ హైస్కూలుకు ఒక ప్రధానోపా ధ్యాయుడు, వ్యాయామ, డ్రాయింగ్‌, క్రాఫ్ట్‌ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:60 బదులుగా 1:45 ఉండాలని, ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ, భద్రతా సిబ్బంది పోస్టు ఖచ్చితంగా భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలు విభజించడం సరికాదన్నారు. తరగతుల విలీనంపై ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడంతో ఉపాధ్యాయ సంఘాలు, ప్రజలు నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించడానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమవుతుందని పేర్కొన్నారు.

రాజకీయ అవసరాలకు

సామాజిక న్యాయం మారుతుందా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి సూటి ప్రశ్న

మాట్లాడుతున్న హరినాథరెడ్డి.

విశాలాంధ్ర- తిరుపతి: రానున్న రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీతోపాటు టీడీపీ బీజేపీకి మద్దతు ప్రకటించడం మోదీ భయపడా? లేక రాజకీయ అవసరాలకు సామాజిక న్యాయం మారుతుందా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు హరినాథరెడ్డి సూటిగా ప్రశ్నించారు. గురువారం స్థానిక బైరాగి పట్టడిలోని సీపీఐ కార్యాలయంలో తిరుపతి జిల్లా సీపీఐ కార్యవర్గ సమావేశం ఎం పార్థసారథి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను భయపెట్టి రాష్ట్రపతి ఎన్నికల నిర్వహిం చాలనే ఆలోచనల వల్లే ప్రతిపక్షమైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బీజేపీని బెదిరించే శివసేన కూడా మద్దతు పలకడం ఆశ్యర్యంగా ఉందన్నారు. గతంలో గిరిజన సామాజిక వర్గానికి చెందిన పీఏ సంగ్మా రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తే ఆనాడు చంద్రబాబు నాయుడు ఎందుకు తటస్థంగా ఉన్నట్టో ప్రజలకు చెప్పగలవా అని నిలదీశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పీమురళి మాట్లాడుతూ ఆగస్టు 14, 15 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలకు ముందుగానే నియోజక వర్గ ఏరియా మహాసభలూ పూర్తిచేయాలన్నారు. తిరుపతిలో భారీ ప్రదర్శన, బహిరంగ సభకు వేలదిగా జనసమీకరణకు ప్రతి కార్యవర్గ సభ్యుడు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌, చిన్నం పెంచలయ్య, జె.రామచంద్రయ్య, జె.విశ్వనాథ్‌, బాలకృష్ణ, బి.నదియా తదితరులు పాల్గొన్నారు.

హలో యువత-మేలుకో యువత

ప్రభుత్వ కొలవుల కోసం పోరాడుదాం: లెనిన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకై ఏఐవైఎఫ్‌ ఆధ్వర్యంలో 'హలో యువత- మేలుకో యువత' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌ లెనిన్‌బాబు తెలిపారు. గురువారం సీఆర్‌ భవన్‌లో 'హలో యువత- మేలుకో యువత' కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెనిన్‌ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు దేశంలోని నిరుద్యోగులకు అండగా నిలుస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని దుయ్యబట్టారు. నేడు ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పి కార్పోరేట్లకు ఊడిగం చేస్తోందని కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఏపీ సీఎం జగన్‌ కూడా నిరుద్యోగులను మోసం చేశారని పేర్కొన్నారు. ఏటా జాబ్‌ క్యాలెండర్‌ అంటూ ప్రకటించి అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే వాటన్నిటిని భర్తీ చేయాలని డిమాండు చేశారు. ఉద్యోగాల భర్తీ కోసం దశల వారీగా ఆందోళ నలకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి 25 వరకు నిరుద్యోగులను ఏకం చేసి ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు కె.శ్రీనివాసులు, యు.కారుమంచి, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య, బీసన్న పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి

గీతం ఇన్‌ఛార్జి వీసీ జయశంకర్‌

విశాలాంధ్ర - మధురవాడ: సామాజిక మాధ్యమాలలో సమాచారాన్ని పంచు కునే వారు అప్రమత్తంగా, అవగాహనతో వ్యవహరించాలని, తద్వారా సైబర్‌ నేరా లను నియంత్రించవచ్చునని గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్‌ ఛాన్సలర్‌ ప్రొఫెసర్‌ జయశంకర్‌ ఇ.వారియర్‌ పేర్కొన్నారు. గీతం మహిళా సాధికారిక విభాగం, నేషనల్‌ కమిషన్‌ ఫర్‌ ఉమెన్‌, సైబర్‌ పీస్‌ ఫౌండేషన్‌ సంయుక్తంగా గురువారం నిర్వహించిన డేటా పైరసీ, సోషల్‌ మీడియా సేఫ్టీ వెబ్‌నార్‌లో ఆయన ప్రసంగించారు. రిజర్వ్‌బ్యాంక్‌ సహా పలు ప్రభుత్వరంగ బ్యాంకులు ఖాతాదారుల లావాదేవీలను ఎప్పటికప్పుడు సైబర్‌ నేరగాళ్ల బారిన పడకుండా సూచనలు చేస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌ మోసాలు పెరగడానికి సోషల్‌ మీడియాలో సమాచారాన్ని పంచుకోవడమే కారణం అన్నారు. సైబర్‌ పీస్‌ ఫౌండేషన్‌ నిపుణురాలు ఆర్‌.కళ్యాణి సురేష్‌ మాట్లాడుతూ, ఇంటర్‌నెట్‌, సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకునే ప్రతి సమాచారాన్ని అపరిచితులు గమనిస్తున్నారన్న విషయం గ్రహించాలన్నారు. డిజిటల్‌ ఫుట్‌ప్రింట్‌లపై నిఘా పెరుగుతోందని తెలిపారు. ఫేస్‌బుక్‌, వాట్స్‌ఆప్‌ వంటి సామాజిక మాధ్యమాలలో ఫోటోలు , వ్యక్తిగత సమాచారం పెట్టే సమయంలో బాగా ఆలోచించుకోవాలని సూచించారు. సైబర్‌ పీస్‌ ఫౌండేషన్‌ సీనియర్‌ ప్రాజెక్టు మేనేజర్‌ ఐ.ఎల్‌.నరసింహరావు మాట్లాడుతూ, సైబర్‌ నేరాల బారినపడిన వారు తమ సంస్థను సంప్రదించాలని సూచించారు. గీతం క్యాంపస్‌ లైఫ్‌ ప్రో వైస్‌ ఛాన్సలర్‌ వై.గౌతమ్‌రావు, గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షురాలు ప్రొఫెసర్‌ సురేఖ చల్లా, కన్వీనర్‌ డాక్టర్‌ స్వాతి చిక్కాల తదితరులు పాల్గొన్నారు.

తుపాను, వరద బాధితులను ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్‌

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తుపాను, వంద బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్‌చేసింది. ఇక్కడి ఎంబీ విజ్ఞాన కేంద్రంలో కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరుగుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రెండో రోజు గురువారంఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించించామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి, శబరి తదితర నదులు, ఏరులు పొంగి ప్రవహిస్తున్నాయని, గోదావరి ఇటీవల ఎన్నడూ లేనంత ప్రమాద స్థాయిలో వరద నీటితో విజృంభిస్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్‌ స్పిల్‌వే వద్ద 34.22 మీటర్ల వద్ద వరద నీరు ప్రవహిస్తోందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్ట్‌ నిర్మాణంలో చేసిన లోపాలు, కాఫర్‌డామ్‌ నిర్మాణం చేసి నిర్వాసితులకు పునరావాసం సౌకర్యాలు కల్పించక పోవడం ప్రస్తుత జలప్రళయం, నష్టానికి కారణమని స్పష్టమవుతున్నదని తెలిపారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ముందస్తుగా చర్యలు తీసుకొకపోవటం వల్ల లక్షలాది మంది దయనీయ స్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన వరద బాధితులకు సహాయక చర్యలు అందించాలని, రిస్క్యూ టీమ్‌లు బోట్లు పెట్టి వరద బాధిత మండలాలలోని అన్ని గ్రామాల నుండి ప్రజలను తరలించి పునరావాస కేంద్రాలకు చేర్చాలన్నారు.

రాష్ట్రపతి అభ్యర్థి ముర్ముకు

వైసీపీ, టీడీపీ పోటాపోటీ మద్దతా?

రాజ్యాంగ విలువలు కాలరాసిన మోదీ

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, బేబీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ, టీడీపీ నిరంతరం ఘర్షణ పడుతున్నప్పటికీ, బీజేపీ నిలబెట్టిన రాష్ట్రపతి అభ్యర్థి ముర్ముకు మద్దతిచ్చే విషయంలో మాత్రం పోటీపడ్డాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబీ ఎద్దేవా చేశారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి రాజకీయ పార్టీకి ఒక విధానం ఉంటుందని, ఈ విషయంలో రెండు పార్టీలూ దాన్ని పక్కబెట్టాయన్నారు. ముర్ముకు మద్దతు ఇవ్వడం వెనుక సామాజిక న్యాయమని పైకి చెబుతున్నా, ఆచరణలో రాజకీయ విధానానికి ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వలేదన్నారు. రాజ్యాంగ విలువలను మోదీ కాలరాస్తున్నారని మండిపడ్డారు. హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు తదితర అంశాలపై బీజేపీ అన్యాయం చేసిందని విమర్శించారు. ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందన్నారు. రాష్ట్రంలో అప్పులు పెరిగిపోయాయని బీజేపీ నాయకులు విమర్శిస్తున్నారని, దీనికి కేంద్రం అనుసరిస్తున్న విధానాలే కారణమని పేర్కొన్నారు.

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఏ.బేబీ మాట్లాడుతూ, పార్లమెంటు విగ్రహావిష్కరణ రాజ్యాంగానికి ప్రతినిధి అయిన రాష్ట్రపతి చేయాలని, దానికి అన్ని పక్షాలనూ పిలవాల్సి ఉందని, అలాంటిదేమీ లేకుండా మోదీ ఏకపక్షంగా ప్రారంభోత్సవం చేశారన్నారు. రాష్ట్రపతి లేకుండా పార్లమెంటులో విగ్రహావిష్కరణ చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు సింహాల విగ్రహం కూడా గతంలో ఉన్నట్లు లేదన్నారు. సారనాథ్‌ స్థూపంపై ఉన్న సింహాల విగ్రహం శాంతి, విజయాలకు చిహ్నంగా ఉండేదని, నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహం దుందుడుకు స్వభావంతో ఉందన్నారు. ఆరెస్సెస్‌ భావజాలంలా సింహాల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇప్పటికే ప్రముఖులు, రాజకీయ పార్టీల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి వంటి వ్యక్తి పార్లమెంటులో విగ్రహం ప్రారంభోత్సవంలో పూజలు చేయడాన్ని తప్పుపట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక దేవాలయానికి శంకుస్థాపన చేస్తూ జాతీయ ఆలయమని ప్రకటించడమూ రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్‌.బాబూరావు పాల్గొన్నారు.

రాంకీ సీడబ్ల్యూటీపీలో కార్మికుడి మృతి

విశాలాంధ్ర - పరవాడ: ఫార్మాసిటీలోని రాంకీ సీడబ్ల్యూటీపీలో గురువారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మృతుడు పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రం కోల్‌ కత్తాకు చెందిన కె.బట్టు (32)గా కార్మిక నాయకులు చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా బాయిలర్‌ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడని, గురువారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో జేసీబీ ఢీకొని బట్టు మృతి చెందాడని తెలిపారు. అయితే ప్రమాదానికి గల వివరాలు పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపించి మృతుడి కుటుంబానికి తక్షణమే రూ. కోటి పరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్‌ అండ్‌ వర్కర్స్‌ యూనియన్‌ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్‌ చేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రతా ప్రమాణాల లోపంతోనే కార్మికుడు మృతి చెందాడని ఆరోపించారు.

సంపాదకీయం

పార్లమెంటులో నిషిద్ధ పదాలు

పార్లమెంటులో ఉపయోగించకూడని పదాల జాబితాతో కూడిన పదకోశాన్ని లోకసభ అధికారులు విడుదల చేశారు. అయితే ఏ పదాలనూ తాము నిషేధించలేదని, ఇంతకు ముందు నుంచే సభ్యులు వాడిన పదాలు మర్యాదకరం కావు అనుకున్న పదాల జాబితాను క్రోడీకరించి ఒక పదకోశాన్ని విడుదల చేశామని లోకసభ స్పీకర్ ఓం బిర్లా వివరణ ఇచ్చుకున్నారు. అవినీతి, దుష్పరి పాలన లాంటి పదాలూ నిషేధిత జాబితాలో చేర్చేశారు. అంటే ఈ అంశాలను ప్రస్తావించకూడదనేగా! సందర్భాన్ని బట్టి ఆ పదాలు మర్యాదకరమైనవా కాదా అని నిర్ధారిస్తామని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. నిషిద్ధ పదాల వినియోగంపై ఉభయ సభలు దాదాపు ఒకే పద్ధతిని అనుసరించే అవకాశమే ఎక్కువ. ఈ పదాల జాబితా పరిశీలిస్తే ప్రభుత్వాలు, ముఖ్యంగా ప్రస్తుత ప్రభుత్వం పాల్పడుతున్న అవకతవకలను విమర్శించడానికి కొన్ని పదాల వినియోగంపై నిషేధం విధించినట్టు స్పష్టం అవుతోంది. రక్తపాతం, మోసం, దుర్వినియోగం, చెంచా, చెంచాగిరి, చేలా, పిల్లచేష్టలు, అవినీతిపరులు, పిరికిపందలు, నేరస్థులు, మొసలి కన్నీరు, నాటకం, కంటి తుడుపు, గూండా, గూండాగిరి, అసమర్థుడు, పెడదోవ పట్టించడం, ఊసరవెల్లి, అవమానం, అసత్యం, అహంకారం, చీకటి రోజులు, దలాల్, దాదాగిరి, బాబ్ కట్, లాలీపాప్, విశ్వాసఘాతుకం, మూర్ఖం, నిరంకుశ మొదలైన మాటలు నిషేధిత జాబితాలో చేరిపోయాయి. ఈ పదాలన్నింటినీ యు.పి.ఎ. అధికారంలో ఉన్నప్పుడు కూడా సభా మర్యాదకు భంగం కలిగించేవి అని రికార్డుల నుంచి తొలగించిన సందర్భాలున్నాయని ఓం బిర్లా సర్ది చెప్తున్నారు. ఈ పదాలేవీ వాడకుండా యు.పి.ఎ. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2జి కుంభకోణం లాంటి వాటిని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత అధికార పక్షం ఏ పదజాలాన్ని వాడి ఎండగట్టి ఉంటుంది? ఇది పరిశోధనకు అనువైన విషయమే. 2జి కుంభకోణం రగడ తీవ్రంగా కొనసాగుతున్న దశలో అప్పటి ప్రతిపక్ష నాయకురాలు సుష్మా స్వరాజ్, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు అరుణ్ జైట్లీ సభను జరగనివ్వం అని సమావేశాలు ప్రారంభించక ముందే ప్రకటించడం ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చిన పదజాలాన్ని వినియోగించడం కన్నా తక్కువ ప్రతికూలాంశం అనడం సాధ్యమయ్యే పనేనా? పార్లమెంటులో జరిగే చర్చలు హుందాతనం కోల్పోయి దశాబ్దాలు అవుతోంది. సభ్యులు వాడే పదజాలంలోని వాడి కన్నా అనేక రెట్లు అవమానకరమైన రీతిలో ప్రవర్తించిన సందర్భాలు ఎన్ని లేవు గనక? బల్లలు చరచడం, మైకులు విరవడం, బల్లల మీదకెక్కడం సర్వ సాధారణమైపోయింది. బిల్లులను ఆమోదిస్తున్న తీరు నానాటికీ దిగజారిపోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టడానికి బిల్లు ఆమోదించినప్పుడు అసలు చర్చే జరగకుండా పార్లమెంటు తలుపులు మూసేసి ఆమోదించామనిపించిన ఉదంతాన్ని, దానికి అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత అధికార పక్షం సహకరించిన తీరును మరిచి పోవడం సాధ్యమేనా? లగడపాటి రాజగోపాల్ లాంటి వారు సభలో పెప్పర్ స్ప్రే చిమ్మి స్పీకర్‌తో సహా అందరినీ అతలాకుతలం చేసిన విధానం కన్నా మాటల సందర్భంలో కటువైన పదజాలం వినియోగించడం తప్పనుకోవడం సాధ్యమవుతుందా? అసలు సభా కార్యక్రమాలు ఏ మాత్రం జరగకుండానే సమావేశాలు ముగిసిన సందర్భాలు ఎన్ని లేవు గనక! మన పార్లమెంటరీ వ్యవస్థకు మూలకందంలాంటి పార్లమెంటును హుందాగా నిర్వహించాలన్న ధ్యాస వదిలేసి దశాబ్దాలు గడిచాయి. పార్లమెంటులో ఘాటైన చర్చలు జరగడం గతంలోనూ ఉంది. చర్చల్లో ఘాటు కన్నా సభ్యుల ప్రవర్తన అనుచితంగా ఉండడం మితిమీరిపోతోంది. ప్రతిపక్షాల వాదనను అంగీకరించక పోయినా కనీసం వినే ఓపిక కూడా మోదీ హయాంలో కనిపించడం లేదుగా! మోదీలాగా పార్లమెంట్ సమావేశాలను నిర్లక్ష్యం చేసి అతి తక్కువ కాలం మాత్రమే సభకు హాజరయ్యే ప్రధానమంత్రి మరొకరున్నారని చెప్పడం అసత్యమే అవుతుంది. ఈ అసత్యం అన్న మాట కూడా ఇప్పుడు వినియోగించకూడదట. అవినీతి అన్న మాట వాడకుండా అధికార పక్షమే కాదు మరే అవినీతినైనా ఎండగట్టే అవకాశం ప్రజా ప్రతినిధులు కొలువు దీరే సభకు ఉండకపోతే ఇక అవినీతినంతటినీ చాపకింద తోసేయాల్సిందేనా? పార్లమెంటును హుందాగా నిర్వహించాలన్న అంశాన్ని ఎవరూ కాదనరు. విమర్శలకు తావిస్తూనే సభా మర్యాదకు భంగం కలగకుండా మాట్లాడకూడదన్నది ఎవరి అభిమతమూ కావడానికి వీలు లేదు. ఓం బిర్లా క్రోడీకరించిన నిషేధిత పదాల జాబితా పరిశీలిస్తే మోదీ సర్కారు ఎదుర్కుంటున్న ఇరకాట పరిస్థితిని అధిగమించడానికే ఈ జాబితా తయారు చేశారని అర్థం అవుతోంది. నెల్లీ మారణకాండ, ఢిల్లీలో సిక్కుల ఊచకోత, గుజరాత్ మారణ కాండ జరిగిన నేపథ్యంలో పార్లమెంటులో జరిగిన చర్చల్లో రక్తపాతం అన్న మాట వాడకుండానే చర్చ జరిగిందని నిరూపించడం వీలయ్యే పనేనా? ఎవరు అధికార పక్షంలో ఉన్నారు, ఎవరు ప్రతిపక్షంలో ఉన్నారు అన్నది నిషేధిత పదకోశం తయారు చేయడానికి కారణం కాకూడదు.

పార్లమెంటులో సభ్యుల ప్రసంగాలు పరిస్థితినిబట్టి, ఆ పరిస్థితులు సృష్టించే భావోద్వేగాలను బట్టి ఉంటాయి. ప్రభుత్వం అనుసరించే విధానాలను, దుర్వర్తనను నిలదీయడానికి చట్టసభలే వేదిక అన్నది ప్రజాస్వామ్య దేశాలన్నీ అంగీకరించే సూత్రమే. కాంగ్రెస్ సుదీర్ఘ కాలం రాజ్యమేలినప్పుడు ఉత్తమ పార్లమెంటేరియన్లుగా పేరు తెచ్చుకున్న వారిలో ఎక్కువ మంది ప్రతిపక్షాలకు చెందిన వారే. ఉత్తమ పార్లమెంటేరియన్లకు అవార్డు ఇవ్వాలి అన్న సంప్రాదాయం ప్రారంభించినప్పుడు మొట్టమొదట ఆ అవార్డు దక్కింది సీపీఐ నాయకుడు ఇంద్రజిత్ గుప్తాకే. ఆయన ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసిన సందర్భాలు, ఘాటైన పదజాలం వాడిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. కానీ ఏనాడూ సభా మర్యాదకు భంగం కలిగించలేదు. ఈ పని చేసిన వారిలో ఆయనొక్కరే లేరు. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అడ్వానీ, అశోక్ మెహతా, బల్ రాజ్ మధోక్, పీలూ మోదీ, హిరేన్ ముఖర్జీ, భూపేశ్ గుప్తా లాంటి ఉద్దండుల పేర్లు ఎన్నైనా ప్రస్తావించవచ్చు. కానీ మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య సౌధానికి రాళ్లెత్తిన తొలి ప్రధాని విమర్శలు ఎదుర్కోకుండా పారిపోయిన సందర్భం ఒక్కటి కూడా లేదు. పైగా హిరేన్ ముఖర్జీ, భూపేశ్ గుప్తా లాంటి వారు మాట్లాడుతున్నారంటే ఆయన పార్లమెంటు ఆవరణలో ఎక్కడున్నా సభలోకి పరుగెత్తుకొచ్చేవారు. ఆవేశంలోనో, ఉద్వేగానికి గురైనప్పుడో మర్యాద తప్పానని అనుకున్నప్పుడు నెహ్రూ వెంటనే క్షమాపణ చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకు బాంబే హైలో చమురు, గ్యాస్ దొరికాయి అని పార్లమెంటు సిబ్బంది చిన్న చీటీ మీద రాసి నెహ్రూకు సమాచారం ఇస్తే ఆ ఉద్వేగంలో స్పీకర్ అనుమతి తీసుకోకుండా ఆ విషయం సభలో ప్రకటించేశారు. ఆ తరవాత నాలుక కరుచుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పారు. పీలూ మోదీ ఒకసారి వెనక్కు తిరిగి మరో సభ్యుడితో మాట్లాడుతుంటే ఒక సభ్యుడు "అధ్యక్షా! ఆయన సభకు వీపు చూపుతున్నారు" అని ఫిర్యాదు చేశారు. హాస్యస్ఫోరకత పాళ్లు కాస్త ఎక్కువగానే ఉన్న పీలూ మోదీ నేను సభకు వెన్ను చూపడం లాంటి దేమీ లేదు నేను గుండ్రంగా ఉన్నాను" అని తన స్థూలకాయం గురించి తానే సరదగా హాస్యోక్తి విసిరారు. అటల్ బిహారీ వాజపేయి ఒక్క ఓటు తేడాతో అధికారంలోంచి దిగిపోయినప్పటి ప్రసంగం చరిత్రాత్మక మైంది. ప్రస్తుత అధికార పక్ష నాయకులు అప్పటి వాజపేయి ప్రసంగాన్ని ఒకసారి వినే ఓపిక చేసుకుంటే ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయాలు ఎలా ఉంటాయో అర్థం అవుతుంది. పార్లమెంటులో ప్రతిపక్షాల వాదనను విని పించుకోకుండా బుల్డోజ్ చేసే స్థితిలో పదజాలం నిషేధమే ప్రధానం అవుతుంది.

నవ్వు పుట్టించే రాజకీయాలు

రా బావా! ఏంటి అక్కడ నుండే నవ్వుతూ వస్తున్నావు? పార్వతి మీ అన్నయ్య వచ్చాడు. యింకో కాఫీ పట్రా. చెప్పు బావా ఏంటి విషయం? అబ్బాయి నుండి ఏదైనా తీపి కబురు అందిందా? అబ్బే అదేం లేదు బావా. పేపరులో వార్త చదివితే నవ్వు వస్తోంది. అదే ఆలోచనతో నవ్వుతూ నడుచుకుంటూ వస్తున్నా.

బావా, అంతగా నవ్వొచ్చే విషయం ఏమిటో చెప్పు! ఏముంది బావా ఏ పార్టీ మీటింగ్ పెట్టినా జనం వస్తున్నారు. అసలు వచ్చినవాళ్ళంతా ఆ పార్టీకి ఓటు వేస్తారంటావా? ఆ జనాన్ని చూసి సభ పెట్టినవారు మురిసిపోతున్నారు. చంద్రబాబు మహానాడుకు జనం వచ్చారు. జగన్ సభకు జనం వచ్చారు. నాకు తెలిసిన ఒకతను రెండుసభలకు వెళ్ళాడు. అదేంటయ్యా యిద్దరికీ ఓటు ఎలా వేస్తావన్నాను? అయ్యా, ఓటు సంగతికొస్తే ఎన్నికల రోజున ఎవరు ఎక్కువిస్తే వారికే. యిప్పుడు మా వూర్లో నాట్లు మొదలు కాలేదు. ఖాళీగా వున్నాను. డబ్బులిస్తామంటే సభలకు వచ్చా. తప్పేంటి అన్నాడు బావా!

నిజమే బావా తప్పు లేదు. ఓట్లు కొని గద్దెనెక్కి కోట్లు సంపాదించే రాజకీయాలు రాజ్యమేలుతున్నప్పుడు చదువు లేని కూలీవాడు డబ్బులు తీసుకుని సభలకు వెళితే తప్పని అనలేం కదా. ప్రస్తుతం విలువలు లేని రాజకీయాలు జరుగుతున్నాయి బావా.

స్వాతంత్ర్యం వచ్చేవరకు ఎన్ని పార్టీలున్నా అంతా బ్రిటిష్ వారిని వెళ్ళగొట్టి మనల్ని మనమే పరిపాలించుకోవాలనే ఏకైక ధ్యేయంతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్ళపాలయ్యారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చాక మన నల్లదొరలలో స్వార్థం పెరిగి ప్రజా సమస్యలకన్నా సొంత సంపాదనకే మొగ్గు చూపడంతో రాజకీయ విలువలు పతనమైపోయాయి.

అది సరే బావా! తెలుగుదేశం పార్టీ వారు 160 సీట్లు మావే అంటే మొత్తం 175 సీట్లు మావే అంటాడు జగన్. ఒక్కొక్కరికి రెండు ఓట్లు ఇస్తే ప్రజలు అలాగే వెయ్యవచ్చు కానీ ఒక్క ఓటు యిద్దరికి ఎలా వేస్తారు? బావా! అవి వారి కలలు. అసలు వారు ప్రజలు నమ్మరని తెల్సి కూడా అలా ఎందుకు మాట్లాడుతారో అర్థం కాదు బావా! ఇదొక జగన్నాటకం బావా! ప్రజలు నమ్మరని తెలిసి కూడా ఏదో మాట్లాడాలని మాట్లాడటమే బావా.

అది సరే బావా! ఒకర్నొకరు తిట్టుకోవడం ఏంటి బావా? విమర్శలు, ప్రతివిమర్శలు రాజకీయాలలో సహజమే కానీ యింత ఘోరంగా చివరికి సభలో ఏడవడం, తొడలు కొట్టడం, దమ్ముంటే రమ్మనడం గతంలో లేవు బావా. ఒకర్ని ఒకరు చివరకు మహిళా నేతలు కూడా యిలా తిట్టుకోవడంతో రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించారు బావా!

బావా, ఒకప్పుడు రాజకీయ విలువలు అనే మాటకు అర్థం వుండేది. నెహ్రూ ప్రధానిగా వున్న రోజుల్లో కమ్యూనిస్టులు ప్రతిపక్షంలో వుండి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజా వ్యతిరేకమైతే వాటిని అడ్డుకుని ఎలా పరిపాలన చేయాలో వివరించేవారు. ఆనాడు ప్రతిపక్ష నాయకుల మాటలకు ఎంతో విలువనిచ్చేవారు. రుజువు చేయలేని మాటలు ఎవరి నోటా విని పించేవి కావు.

అది నిజమే బావా! యిప్పుడు నోటికొచ్చిందల్లా అనేయడమే. అందుకే విమర్శలకు విలువ లేక ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు ప్రభుత్వం దిగి రావాలి-మేం ఎక్కాలి అనే పదమే ఏ పార్టీ ప్రతిపక్షంలో వున్నా వాడే మాట. నిజమే బావా, ప్రభుత్వం చేసే పనుల్లో తప్పులు చూపి ఏం చెయ్యాలో చెప్పడం ప్రతిపక్షం బాధ్యత. కానీ, ఏ పార్టీ ప్రతిపక్షంలో వున్నా ఆ విషయం మరచి ప్రవర్తిస్తున్నారు.

ఈ మధ్య జరిగిన వైసీపీ ప్లీనరీలో జగన్ను ఆ పార్టీకి శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు కానీ అది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి విఘాతమే కదా బావా. ఇంకెవరూ పోటీ చేయడానికి వీలుండదు కదా! అవును బావా, ఎవరి జాగ్రత్త వారిది. దీన్ని కూడా మినహాయించి ఉంటే బాగుండేది. యన్.టి.రామారావు ఆ పని చేసి వుంటే ఇప్పుడు చంద్రబాబుకు తెలుగు దేశం పార్టీ దక్కేది కాదు గదా!

అది సరే బావా, అసలు ప్రతిపక్షమే వుండరాదని తమ పార్టీ తప్ప మరో పార్టీ దేశంలో వుండరాదనే ఆలోచన బీజేపీ చేస్తోంది కదా ఇదెంత అన్యాయం! న్యాయాన్యాయాలతో సంబంధం లేదు బావా. శాశ్వతంగా తామే అధికారంలో వుండి హిందూ రాజ్యంగా మార్చి మరో మతస్తులు వుండరాదనేది వారి ఆలోచన. అందుకే ఒక్కో రాష్ట్రాన్ని తమ చేతుల్లోకి తీసుకునే పనిలో నిమగ్నమైంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, తెలంగాణను ఆక్రమించుకునే పథకంలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. అధిక ధరలు తగ్గించకుండా పెట్టుబడిదారులకు ప్రజల సొమ్ము దోచిపెడుతూ వారిచ్చే ఎన్నికల నిధులతో తమ పథకం సఫలీకృతం చేసుకునే పనిలో వుంది బావా.

నిజమే బావా అటు కాంగ్రెస్ ఇటు వామపక్ష పార్టీలు బలహీనపడటం బీజేపీకి నల్లేరు మీద బండి తోలినట్లుగా వుంది. ఇక మోదీ, అమిత్ షాలు రాజు మంత్రిగా దేశాన్ని పాలిస్తూ ప్రజల్ని రామనామ జపంలో ముంచి వారనుకున్నట్లుగా పాలన సాగిస్తున్నారు. అందులో సందేహం లేదు. ప్రతిపక్ష పార్టీలు కలవనంతకాలం వారికి తిరుగుండదేమో. చివరిగా ఒక సందేహం బావా. కరోనా మహమ్మారి లక్షల మంది ప్రాణాలను హరిస్తున్నా సీరియస్‌గా పట్టించుకోకుండా 20 వేల కోట్ల రూపాయలు పెట్టి పార్లమెంట్ కొత్త భవనం కట్టారు. ఇప్పుడు జాతీయ చిహ్నం రూపం మార్చి గర్జించే సింహం కాంస్య విగ్రహం ప్రధాని మోదీ ఆవిష్కరించడమేమిటి? బావా! ఆయన ఏం చేసినా చెల్లుబాటు అయినంతకాలం ఇలాంటివే జరుగుతాయి బావా.

వ్యాస రచయిత సెల్: 9885569394

వామపక్షాల ఆశాజ్యోతి లాటిన్ అమెరికా

కిలసాంకి

ఇటీవల వరకు వామపక్షాల ప్రభావం తగ్గిపోతోందని విశ్లేషకులు వ్యాఖ్యానించేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. లాటిన్ అమెరికాలో చాలా దేశాలలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. పదేళ్లకు పైగా మితవాద ప్రభుత్వాలు చేసిన పాలనలో తీవ్రమైన వైఫల్యాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలలో గణనీయమైన మార్పులు వచ్చాయి. మళ్లీ వామపక్షాల పైపు ప్రజలు మొగ్గు చూపారు. గతంలో వివిధ రూపాలలో పశ్చిమ దేశాలు వామపక్ష ప్రభుత్వాలలో తిరుగుబాట్లను ప్రోత్సహించాయి. అర్జెంటైనాలో ఎన్నికల ద్వారా, బ్రెజిల్‌లో పార్లమెంటు ద్వారా, ఈక్వెడార్‌లో ఎలాంటి అలజడి లేకుండా, బొలీవియాలో సైనిక పరంగా తిరుగుబాట్లను ప్రోత్సహించారు. అనంతరం మితవాద ప్రభుత్వాలు ఏర్పడినప్పటికీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఈ దేశాలు పశ్చిమరాజ్యాలకు అనుకూలంగా పని చేశాయి. ఆర్థికంగా, సామాజికంగా దిగజారిపోయాయి. అనంతరం చాలాదేశాలలో వామపక్ష శక్తులు క్రమంగా పుంజుకుంటూ వచ్చి తాజాగా ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. వాస్తవంగా అనేక ఆదర్శనీయమైన సంస్కరణలు అమలు చేసి నప్పటికీ పశ్చిమ దేశాలు సాధించిన దుష్ప్రచారం ప్రజలలో మార్పు తీసుకు వచ్చింది.

తాజాగా కొలంబియాలో వామపక్ష నేత గుస్తావ్ పెట్రో ఘన విజయం సాధించారు. బ్రెజిల్‌లో అక్టోబరులో జరగనున్న ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు లులా తప్పనిసరిగా గెలవనున్నారని బలమైన సంకేతాలు ఉన్నాయి. లాటిన్ అమెరికా చరిత్రలో మొదటిసారిగా ఆరు ముఖ్యమైన దేశాలు- అర్జెంటైనా, బ్రెజిల్, చిలీ, మెక్సికో, పెరూ దేశాలలో కొన్ని తేడాలు ఉన్నప్పటికీ వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీంతో లాటిన్ అమెరికాలో వామపక్ష భావజాలం విస్తరిస్తోందని అనేక మంది విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొదట నికరాగ్వా, వెనిజులాలో వామపక్ష ప్రభుత్వాల వైపు ప్రజలు ఆలోచించి ఎన్నుకున్నారు. ఇటీవల కాలంలో అర్జెంటైనా, బొలీవియాలలో వామపక్షాలను ప్రజలు ఆదరించి అధికారాన్ని కట్టబెట్టారు. బ్రెజిల్‌లోను వామపక్ష ప్రభుత్వం ఏర్పడనున్నదని సర్వేలన్నీ తెలిపాయి. అలాగే కొలంబియా, హోండూరస్, మెక్సికో, పెరూ, చిలీ దేశాలలోనూ వామపక్ష ప్రభుత్వాలు ప్రజలకు అనుకూలమైన విధానాలను అవలంభిస్తూ వారి ఆదరణను చూరగొంటున్నాయి. అమెరికాకు సన్నిహితంగా ఉన్న ఈ ప్రాంత దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఆ దేశంతో చేసుకున్నాయి. మత్తుమందుల వ్యాపారం పైన పెరూ, మెక్సికో, కొలంబియా ప్రభుత్వాలు పెద్ద పోరాటమే చేశాయి. కొలంబియా అమెరికా పనుపున ఈ ప్రాంతంలో వామపక్ష ప్రభుత్వాలను అప్రతిష్ఠ పాల్జేసింది. ఇప్పుడు ఈ ప్రాంతంలో కమ్యూనిజం వ్యతిరేక పోరాటం పేరుతో సాగుతున్న అణచివేత, హింసను తాజాగా ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు నిరోధించడంలో సమర్థంగా పనిచేస్తుందని భావిస్తున్నారు.

ప్రజాస్వామ్య సమూహాలను ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలలోకి తీసుకు రావటంలో వామపక్షాలు విజయం పొందాయి. ఈ నేపథ్యంలోనే కనీసం ఆరు

మొదటిసారి వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడిన దేశాలు సామాజిక ఉద్యమాల నిర్వహణకు భిన్నమైన పద్ధతులను అనుసరించాయి. 1990లలో, 2000లలో జరిగిన తీవ్రవాద పోరాటాలు నయా ఉదార ప్రభుత్వాలను అదుపులో పెట్టగలి గాయి. ఈ పరిణామమే వామపక్ష ప్రభుత్వాల ఏర్పాటుకు దారి తీసింది. చిలీలో విద్యార్థుల నిరసనలు, ఉపాధ్యాయుల సమ్మెలు, పింఛనుదారుల, మహిళా ఉద్యమాలు ఒక దశాబ్దిలో బలోపేతమయ్యాయి. ఇందుకు వామపక్షాలు ప్రజా సమూహాలను సమీకరించే ప్రాథమిక బాధ్యతను సమర్థంగా నిర్వహించాయి. అలాగే కొలంబియాలో దాదాపు దశాబ్ది పాటు అంటే 2011 నుంచి 2018 వరకు విద్యార్థి ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. 2013, 2016లో రైతు ఉద్యమాలు తీవ్ర స్థాయిలో జరిగాయి. అనంతరం 2019 2021లలో జాతీయ స్థాయి సమ్మెలు ప్రజలను ఆలోచింపజేశాయి.

దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రజానుకూలంగా మలుస్తున్నాయి. వాస్తవంగా 1970-80లలో మితవాద నియంతృత్వ ప్రభుత్వాలు పౌర, కార్మిక వామపక్ష ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మితవాద ప్రభుత్వాలు ఘోరంగా ఓటమి పాలయ్యాయి. ప్రత్యామ్నాయంగా ప్రజలు వామపక్షాల వైపు మొగ్గు చూపారు. 2019 నుండి 2022 వరకు ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు అమలు చేస్తున్న పొదుపు విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు సుస్థిరమైన ఉద్యమాలను నిర్వహించాయి. అర్జెంటైనా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్‌లు రాడికల్ ఉద్యమాల ద్వారా వామపక్ష శక్తులను బలోపేతం చేసి నయా ఉదారవాద ప్రభుత్వాలను బలహీనపరిచాయి. అర్జెంటైనా, బొలీవియా, బ్రెజిల్‌లో వామపక్షం బలహీనంగా ఉన్నదనిపించినప్పటికీ మితవాద ప్రభుత్వాన్ని ఎదుర్కొని నిలబడేందుకు తగిన శక్తిని సముపార్జించుకున్నది. బొలీవియాలో జరిగిన ఉద్యమాలు సోషలిజం కోసం జరిగిన పోరాటాలకు పునాదులు వేసింది.

మొదటిసారి వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడిన దేశాలు సామాజిక ఉద్యమాల నిర్వహణకు భిన్నమైన పద్ధతులను అనుసరించాయి. 1990లలో, 2000లలో జరిగిన తీవ్రవాద పోరాటాలు నయా ఉదార ప్రభుత్వాలను అదుపులో పెట్టగలిగాయి. ఈ పరిణామమే వామపక్ష ప్రభుత్వాల ఏర్పాటుకు దారితీసింది. చిలీలో విద్యార్థుల నిరసనలు, ఉపాధ్యాయుల సమ్మెలు, పింఛనుదారుల, మహిళా ఉద్యమాలు ఒక దశాబ్దిలో బలోపేతమయ్యాయి. ఇందుకు వామపక్షాలు ప్రజా సమూహాలను సమీకరించే ప్రాథమిక బాధ్యతను సమర్థంగా నిర్వహించాయి. అలాగే కొలంబియాలో దాదాపు దశాబ్ది పాటు అంటే 2011 నుంచి 2018 వరకు విద్యార్థి ఉద్యమాలు పెద్ద ఎత్తున జరిగాయి. 2013, 2016లో రైతు ఉద్యమాలు తీవ్ర స్థాయిలో జరిగాయి. అనంతరం 2019 2021లలో జాతీయ స్థాయి సమ్మెలు ప్రజలను ఆలోచింపజేశాయి. ఈ దశలో మితవాద ఉర్బిస్కో ప్రభుత్వం సంక్షోభంలోకి వెళ్లింది. 2016లో కొలంబియా ప్రభుత్వానికి, తీవ్రవాద ఉద్యమ సంస్థ ఎఫ్ఎఆర్‌సికి మధ్య ఒప్పందం కుదరడంతో రాజకీయ దృశ్యం తీవ్ర మార్పుకు గురైంది. ఇటీవల గుస్తావ్ పెట్రో అధ్యక్షుడిగా గెలుపొందడం రెండు దశాబ్దాల పాటు జరిపిన ఉద్యమాల ఫలితమే. ఆయన బొగొటా మేయర్‌గా పనిచేసి నగర ప్రజలకు ఎన్నో సౌకర్యాలు కల్పించారు. ఆయనను పదవి నుండి తప్పించేందుకు అటార్ని జనరల్ అలెగ్జాండ్రొ అర్డొనెజ్ తీవ్ర ప్రయత్నమే చేశారు.

హోండూరస్‌లో గ్జిఒమర కాస్ట్రో పార్టీ (లిబ్రి) ప్రజా ఉద్యమాల ద్వారా బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. 2009లో మాన్యుయల్ జెలయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగింది. నేషనల్ ఫ్రంట్ అధ్వర్యంలో మహిళలు, కార్మికులు దిగువ తరగతి ప్రజలు పెద్ద ఉద్యమాలు నడిపారు. దాని ఫలితమే వామపక్ష ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చింది. లాటిన్ అమెరికా దేశాలలో కొవిడ్ 19 మహమ్మారి అత్యంత తీవ్రంగా ప్రభావం చూపింది. గత ఏడాది జీడీపీ వృద్ధి ఆరు శాతం ఉన్నప్పటికీ 2020లో కుదేలైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దేంత పరిస్థితి లేకుండా పోయింది. బలమైన ప్రజా ఉద్యమాల ద్వారానే ఈ దేశాలలో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయని విశ్లేషకులు అంచనా వేశారు.

ఐ-మెయిల్

ఇవి అనకూడని మాటలా?

పార్లమెంట్‌లో నిషిద్ధమైన పదాల్ని, పద బంధాల్ని సూచిస్తూ లోక్‌సభ జాబితా విడుదల చేసింది. ఆ పదాల్ని సభ్యులు వాడకూడదు. సభ్యులు వాటిని వాడితే రికార్డుల నుంచి తొలగించడం కానీ, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం గానీ సభాపతులు చేస్తారు. అయితే ఈ జాబితాలో చాలా పదాలు జన జీవితంలో మామూలుగా వాడేవి కావడం విశేషం. వాటిని నిషేధిత పదాల జాబితాలోకి ఎందుకు ఎక్కించారో అర్థం కావడం లేదు. అబద్ధం, అవినీతి, డ్రామా, కంటి తుడుపు, మొసలి కన్నీళ్లు ఇలాంటివి చాలా పదాలున్నాయి. అందులో అసభ్యత ఏమిటో, అవమానం ఏమిటో తెలియడం లేదు. చట్ట సభల్లో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వారు తక్కువేమీ కాదు. కానీ చర్చల్లో క్రిమినల్ అన్న పదం నిషేధమట. చర్చలన్నీ అవినీతిపై జరుగుతాయి. కానీ ఆ పదం వాడకూడదు. ఒక ప్రకటన అబద్ధం అంటే తప్పు కదా 'నిజం కానిది' అనొచ్చేమోనని జాబితా చూశాను. జాబితా ప్రకారం అదీ తప్పే. 'అన్ ట్రూ' అన్నది కూడా నిషేధమే. మరి అబద్ధాన్ని అబద్ధమని ఎలా చెప్పాలి? ఏమో? ఇంకో అనరాని మాట ఒకరిని శకుని అని సంబోధించడం. పాపం శకుని. మహా భారతంలో కీలక పాత్ర పోషించిన ఆయన పేరు వాడడం నిషేధం. చివరకు ఎవరినైనా దుశ్శాసనుడిగా అభివర్ణించినా పరవాలేదు కానీ ఆ వ్యూహకర్తతో పోల్చరాదు. అన్నట్టు నియంత పదమూ నిషేధమే. ఈ జాబితా వాస్తవిక పద ప్రయోగాలకు దూరంగా ఉంది. నొప్పించని పదాల్ని కూడా అసభ్య పదజాలంగా ముద్ర వేసింది. ఇక సభ్యులు అష్టావధానంలో నిషిద్ధాక్షరి రీతిలో ఆ పదాలు మినహాయించి మాట్లాడాల్సి ఉంటుంది. కష్టమే మరి. బ్రిటన్ ప్రధానిగా పని చేసిన చర్చిల్ అలా మాట్లాడడంలో నేర్పరి. మీరు అబద్ధం ఆడుతున్నారు అంటే అన్ పార్లమెంటరీ అవుతుందని, 'మీరు నిజం పొదుపుగా వాడతారు' అనేవారు. అలా ఎన్నో ఉదాహరణలు ఆయనవి. ఇలా అయితే ప్రస్తుతం చట్ట సభల సభ్యులు చాలా కష్టపడాలి.

– డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, 9440836931

పాలకుల దోపిడీ, అప్పుల వల్లే లంక సంక్షోభం

బొల్లిముంత సాంబశివరావు

శ్రీలంకలో సంక్షోభం తీవ్రస్థాయికి చేరింది. మేలో విక్రమ సింఘే నాయ కత్వాన కొత్త ప్రభుత్వం ఏర్పడినా ఆర్థిక, రాజకీయ సంక్షోభం ఏ మాత్రం తగ్గకపోగా మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆహార ధాన్యాలతో పాటు, నిత్యా వసర సరుకుల కొరత ఇంకా తీవ్ర రూపం దాల్చి వాటి ధరలు ఆకాశాన్నంటి ప్రజ లకు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహ కందని విధంగా పెరిగాయి. దేశీయ కరెన్సీ విలువ పెద్దఎత్తున పడిపోయింది. సామాన్య ప్రజల పరిస్థితి భయానకంగా మారింది. ఆహారం కోసం అలమటిస్తున్నారు.

శ్రీలంక ఇలాంటి పరిస్థితులకు కారణం, పాలకులు అనుసరించిన సామ్రాజ్య వాద, గుత్త పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలే . ఫలితంగా దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆహార ధాన్యాల కొరత,ధరలు అదుపులేకుండా పెరగటం, విదేశీ అప్పుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ కూరుకు పోవటం జరిగింది. మహిందా రాజపక్స ప్రభుత్వానికి వ్యతిరేకంగా మే 9న ప్రజా నిరసన వెల్లువ వెత్తింది. ఆందోళనలతో దేశం అట్టుడికి పోయింది. ప్రజా ఉద్యమ దాటికి రాజపక్స ప్రభుత్వం రాజీనామా చేసింది .

శ్రీలంక సంక్షోభం అకస్మాత్తుగా వచ్చింది కాదు. 1977 నుండి సామ్రాజ్య వాదుల కనుసన్నల్లో ఎల్‌టిటీ తో సాగిన అతర్యుద్ధం ముగిసిన తర్వాత 2009 నుండి తీవ్రంగా అమలు జరుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య, సరళీకరణ విధానాల ఫలితమే ఈ సంక్షోభం. ఫలితంగా శ్రీలంక ఆర్థిక నిర్మాణంలో అవకతవకలు, పరాధీనత స్థిర పడింది. స్వావలంబన అంతరించింది. శ్రీలంక సంక్షోభాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న గ్లోబల్ మీడియా, భారత ప్రచార సాధనాలు వీటిని ప్రస్తావించకపోవడం పెట్టుబడిదారీ దోపిడీ విధాల సమర్ధనలో భాగమే. కోవిడ్ విపత్తుల కాలంలో ఆదాయం కోల్పోయిన ప్రజలకు ఊరటనివ్వటానికి ప్రజల మీద భారం పడకుండా వ్యాట్ పరోక్ష పన్నును తగ్గించటం, ఫలితంగా ప్రభుత్వ,రాబడి తగ్గి ఆర్థిక లోటు పెరగటం వల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని గుత్త పెట్టుబడిదారుల గుప్పిట్లో ఉన్న మీడియాలు ప్రచారం చేస్తున్నాయి. మరో వైపున గుత్త పెట్టుబడిదారులకు ఇస్తున్న పన్ను ప్రోత్సాహకాలు, రాయితీల వలన శ్రీలంక మౌలిక సదుపాయాల, దేశాభివృద్ధి కోసమంటూ

అంతర్జాతీయ ద్రవ్యనిధి నుండి 2022 వరకు 17 సార్లు రుణం తీసుకుని వారు పెట్టే కఠినమైన షరతు లకు ఆమోదించి, సంస్కరణలను కఠినంగా అమలు హామీ ఇచ్చింది. ఏషియన్ డవలప్‌మెంట్ బ్యాంక్, చైనా, జపాన్, యూరప్ దేశాల నుండి రుణాలు తీసుకుంది.

శ్రీలంక ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాలు ప్రజల మౌలిక సదు పాయాలు పెంచటానికి, దేశాభివృద్ధికి దోహదపడలేదని, 2013 నుండే ప్రభుత్వ అంచనాలు తారుమారు అయినాయని ప్రపంచ బ్యాంక్ నివేదికలు తెలియ చేస్తు న్నాయి. 2003-2012 మధ్య కాలంలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 6.4% ఉండగా 2018 నాటికి 33%కి, 2019 నాటికి 2 3% తగ్గింది. స్థూల దేశీయో త్పత్తిలో ప్రభుత్వ రుణం వాటా 2017లో 77.8% ఉండగా 2020 నాటికి 101% పెరిగింది. శ్రీలంక ప్రభుత్వం విదేశీ రుణ సహాయం లేకుండా పరిపాలన చేయలేని స్థితికి చేరింది. 2016లో ప్రపంచ బ్యాంక్ నుంచి 100 మిలియన్ అమెరికా డాలర్లు, జపాన్ అంతర్జాతీయ సహకార ఏజన్సీ నుండి 100 మిలియన్ల అమెరికా డాలర్లు, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుండి 162.2 మిలియన్ అమెరికా డాలర్లు రుణంగా తీసుకుంది. వాటి షరతులను ఆమోదిస్తూ వివిధ రంగాలలో సంస్కర ణలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ విధానాల ఫలితంగా ఏర్పడిన సంక్షోభం తీవ్రమౌతూ ఉండటంతో రుణాలను నిరంతరం తీసుకోవాల్సిన పరిస్థితికి శ్రీలంక చేరింది. 2018లో చైనా నుండి 1.25 బిలియన్ డాలర్లు, బంగ్లాదేశ్ నుండి 200 మిలియన్ అమెరికా డాలర్లు కరెన్సీ స్వాప్ కింద తీసుకున్నది. తిరిగి చెల్లించే పరిస్థితి లేదు. విదేశ మారక ద్రవ్యాన్ని ఆర్జించటానికి శ్రీలంకకు ఉన్న మార్గాలు ఎగుమతులు, టూరిజం, విదేశాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు దేశానికి జమ చేసే సంపాదన.

తేయాకు, రబ్బరు, మొదలైన ప్రాథమిక వస్తువులనే శ్రీలంక ఎగుమతి చేస్తున్నది. ప్రపంచ మార్కెట్ వీటి ధరలు 2013 నుండి తగ్గుతూనే ఉన్నాయి. శ్రీలంక కరెన్సీ మారకపు విలువ తగ్గటం వలన ఎగుమతుల ద్వారా వచ్చే మార కపు ఆదాయం తగ్గిపోతున్నది. 2020లో ఈ తగ్గుదల 750 మిలియన్ల అమెరికా డాలర్లుగా ఉంది. దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి పెట్టేది టూరిజం. కోవిడ్ విపత్తు వల్ల అన్ని దేశాల్లో ప్రయాణాలపై నిషేధంతో ఈ రంగం కుప్ప కూలింది. టూరిజం వలన లభించే విదేశీ మారక రాబడులు ఆగిపోయాయి. కోవిడ్ వల్ల విదేశాలు వెళ్లిన యువత ఉపాధి కోల్పోయి తిరిగి దేశానికి రావ టంతో, వారి ద్వారా వచ్చే ఆదాయం పోయింది. ఈ విధంగా ఆదాయ వనరుల దారులు మూసుకు పోయాయి. శ్రీలంక ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి గ్లోబల్ మీడియా ప్రచారం చేస్తున్న మరో కారణం ఏమిటంటే రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించని సేంద్రియ సాగుకు మారాలని శ్రీలంక ప్రభుత్వం ప్రకటించటం. దీని మంచి చెడ్డలు ఎలా ఉన్నా, అసలు ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఏటా 100 బిలియన్ రూపాయల టర్నోవర్ ఉన్న రసాయనిక ఎరువుల మాఫియా శ్రీలంకలో బలంగా ఉండి రసాయనిక ఎరువులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి సమస్యను పక్కదారి పట్టించింది.

విదేశీ రుణాల ఊబిలో చిక్కుకున్న శ్రీలంక వాటి రుణాలు తీర్చటం సాధ్యం కాని పరిస్థితికి నెట్టబడింది. ఈ సంవత్సరం చెల్లించాల్సిన విదేశీ అప్పులు 609 బిలియన్ల అమెరికా డాలర్లు. 2020లో స్థూల జాతీయోత్పత్తిలో విదేశీ రుణాల వాటా 60.9% కాగా, 2021 సెప్టెంబర్ నాటికి విదేశీ మారక చెల్లింపులలో కరెంట్ అకౌంట్‌లో లోటు 740.8 మిలియన్ అమెరికా డాలర్లు. దేశంలో విదేశీ మారక నిధులు అంతరించాయి. మార్కెట్ శక్తులు నిర్ణయించే శ్రీలంక కరెన్సీ మారకపు విలువ మరింత దిగజారింది.

వ్యాస రచయిత సెల్: 9885983526

ఈసీఎల్ మేనేజర్ సహా ఏడుగురి అరెస్ట్

కోల్‌కతా: కోట్లాది రూపాయల బొగ్గు దోపిడీ కుంభకోణానికి సంబంధించి ప్రభుత్వ అధ్వ ర్యంలోని ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఈసీ ఎల్)లో పనిచేస్తున్న, ముగ్గురు రిటైర్డ్ జనరల్ మేనేజర్‌లతో సహా ఏడుగురిని సీబీఐ అరెస్ట్ చేసినట్లు ఒక అధికారి తెలిపారు. అరెస్టయిన మిగతా వారిలో మేనేజర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం కోల్‌కతా కార్యాలయంలో సీబీఐ విచారణ అనంతరం వారిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరుపరిచేందుకు వారిని అసన్ సోల్‌కు తీసుకువెళతామని చెప్పారు. ఈ కుంభ కోణానికి సంబంధించి తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ భార్య రుజీరా నరులా బెనర్జీని కేంద్ర ఏజెన్సీ రెండుసార్లు విచారిం చింది. గత ఏడాది రుజీరా సోదరి మేనక గంభీర్, ఆమె భర్త, మామలను కూడా విచారించింది. ఈ కుంభ కోణంలో పరారీలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ నేత వినయ్ మిశ్రాపై సీబీఐ లక్ష రూపాయల నజరానా ప్రకటించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద మిశ్రా, అతని సోదరుడు వికాస్, ప్రధాన నిందితుడు అనూప్ మాఝీకి చెందిన రూ.9.28 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

కేరళలోనే కార్మికుల వేతనాలు అధికం

- జాతీయ సగటు కంటే ఎక్కువ
- ఇతర రాష్ట్రాల్లో దారుణం: ఆర్బీఐ నివేదిక

తిరువనంతపురం: కార్మికుల వేతనాలు కేరళలోనే అత్యధికంగా ఉన్నాయనీ, ఈ విషయంలో రాష్ట్రంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం చక్కటి ప్రతిభను కనబర్చిందని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నివేదిక తెలిపింది. 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు గ్రామీణ భారతదేశంలో రాష్ట్రాల వారీగా సగటు వేతనాన్ని ఈ నివేదికలో ఆర్బీఐ తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ, సాధారణ వ్యవసాయ, వ్యవసాయేతర కార్మికుల రోజువారీ వేతనాలు కేరళలో అత్యధికంగా ఉన్నాయి. భారత్‌లో కేరళ, ఇతర రాష్ట్రాలలో వేతనాల మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉన్నది. కేరళలో కార్మికులకు చెల్లించే వేతనం.. అత్యల్ప వేతనం, జాతీయ సగటుతో పోలిస్తే రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం అని ఆ నివేదికతో ఆర్బీఐ పేర్కొంది. కేరళలో శాసన సభకు ఎన్నికైన సభ్యులకు (ఎమ్మెల్యే) చెల్లించే ప్రోత్సాహకాలు దేశంలోనే అత్యల్పంగా ఉన్నాయి. మహారాష్ట్ర, గుజరాత్‌లోని పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో కార్మికులకు చేసే చెల్లింపులు దారుణంగా ఉన్నాయి. ఎమ్మెల్యేలకు చెల్లించే ప్రోత్సాహకాలు అధికంగా ఉన్నాయని తెలిపింది. కేరళలో అధిక వేతనాలకు సంఘటిత, అసంఘటిత రంగా లలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాల నిరంతర పోరాటానికి కారణమని చెప్పొచ్చని విశ్లేషకులు తెలిపారు. కార్మికులకు హక్కులకు భరోసా కల్పించటంతో రాష్ట్రంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వ పాత్ర కూడా కీలకమని వివరించారు. కేర ళకు చెందిన ఒక నిర్మాణ కార్మికుడి సగటు వేతనం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నది. రాష్ట్రంలో నిర్మాణ కార్మికుడి సగటు వేతనం రూ. 829.7గా ఉం డగా, జాతీయ సగటు మాత్రం రూ. 362.2 గా ఉండటం గమనించాల్సిన అంశం. సాధారణ వ్యవసాయ కార్మికుల విషయంలో జాతీయ సగటు అంటే వారికి దక్కేది రూ. 309.9 మాత్రమే. కేరళలో మాత్రం ఈ కార్మికులు రూ. 706.5 సంపాదిస్తున్నారు. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్, యూపీ దారుణ ప్రదర్శనను కనబర్చాయి. ఈ రెండు రాష్ట్రాలు జాతీయ సగటు కంటే తక్కువగా చెల్లిస్తున్నాయి. 2014 సాధారణ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ 'ఒక మోడల్ రాష్ట్రం'గా ప్రచారం అయింది. మూడు కేటగిరిల్లో తక్కువ వేతనాలతో దిగువ ఐదు రాష్ట్రాల జాబితాలో ఉండటం గమనార్హం. కార్మికు లకు వేతనాలు అధికంగా దక్కటం వెనక కార్మిక సంఘాల పోరాటం ఉన్నదన్న విషయాన్ని నాయకులు గుర్తు చేశారు. మెరుగైన వేతనాల కోసం నిరంతర పోరాటాలు జరిగాయనీ, కార్మిక వర్గం నిరంతర పోరాటాలు, రాష్ట్రాన్ని పాలించిన ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ చొరవతోనే కార్మికులు అధిక వేతనాలు పొందుతున్నారని చెప్పారు.

దేశవ్యాప్తంగా వర్షబీభత్సం

- గుజరాత్‌లో మోకాళ్ల లోతు వరద నీరు
- థానేలో ఇల్లు కూలి మహిళకు గాయాలు
- వైతరణి నదిలో చిక్కుకున్న కార్మికులను కాపాడిన ఎన్‌డీఆర్ఎఫ్
- గడ్చిరోలీ జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- ఊటీ రోడ్లపై కూలిన చెట్లు, తెగిపడిన విద్యుత్ తీగలు
- వరద నీటిలో ముంబై ట్రాఫిక్

అహ్మదాబాద్: దేశ వ్యాప్తంగా వాన బీభత్సం కొనసాగుతోంది. గడచిన 24 గంటల్లో గుజరాత్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ కారణంగా జిల్లాలోని కొన్ని నదులు ఉధృతంగా ప్రవహించడంతో నవ్‌సారిలోని చాలా ప్రాంతాలు మోకాళ్లలోతు నీటిలో మునిగిపోయాయని అధికారులు గురువారం తెలిపారు. గురువారం తెల్లవారుజామున తాపి, వడోదర జిల్లాల్లో చిక్కుకుపోయిన 45 మందిని అధికారులు రక్షించినట్లు ప్రభుత్వం తెలిపింది. నాలుగు రోజుల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుజరాత్ లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, సౌరాష్ట్ర ప్రాంతంతో సహా పలు చోట్ల పగటిపూట భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దక్షిణ గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలోని వాన్‌స్దా తాలూకాలో అత్యధికంగా 394 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రాష్ట్ర అత్యవ సర విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో వల్సాద్ జిల్లాలోని కప్రడ, ధరంపూర్ తాలూకాలో వరుసగా 377 మిల్లీమీటర్లు, 340 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం 6 గంటల నుంచి కేవలం రెండు గంటల్లో వల్సాద్ జిల్లాలోని ధరంపూర్ తాలూకా, పోర్‌బందర్‌లోని రణవావ్‌లో వరుసగా 99 మిల్లీమీటర్లు, 58 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, పూర్ణా, అంబికా నదుల నీటిమట్టం పెరగడంతో నవ్‌సారి, బిలిమోరా నగరాలతోపాటు, జిల్లాలోని పలు ప్రాంతాలు మోకాళ్ల లోతులో మునిగిపోయాయి. తాపీలోని డోల్వన్ తాలూకాలో, వరదల్లో చిక్కుకుపోయిన 10 మందిని అగ్ని మాపక దళ సిబ్బంది రక్షించింది. వడోదరలోని కర్జన్ తాలూ కాలోని కందారి గ్రామంలో చిక్కుకున్న 18 మంది చిన్నా రులు, ఇద్దరు రోగులతో సహా 35 మందిని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం సురక్షిత ప్రాంతాలకు తరలించింది.

10మంది కార్మికులను కాపాడిన ఎన్‌డీఆర్ఎఫ్

పాల్ఘర్: మహారాష్ట్రలోని వైతరణి నది వరద నీటిలో చిక్కుకుపోయిన నిర్మాణ సంస్థకు చెందిన పది మంది కార్మికులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం గురువారం రక్షించినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలి పారు. ముంబై-వడోదర ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో నిమగ్న మైన జీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్మికులు తమ పనిలో భాగంగా బార్జ్‌లో నదిలోకి ప్రవేశించారు. అయితే పాల్ఘర్ జిల్లాలో వర్షాలు భారీగా కురుస్తున్నాయి. వారు నదిలో చిక్కుకునే సరికి రక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి హెలికాప్టర్ ఏర్పాట్లు చేశారు. నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం పడవను ఉపయోగించి మొత్తం 10 మంది కార్మికులను రక్షించింది.

గడ్చిరోలీలో సురక్షిత ప్రాంతాలకు 3వేలమంది

నాగపూర్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 29 గ్రామాలకు చెందిన 3వేల మంది ప్రజలను ముందు జాగ్రత్త చర్యగా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారి గురువారం తెలిపారు. భారత వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిందని, వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచన ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని గోదావరి, కాళేశ్వరం, ఇంద్రావతి నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తుండగా, వైనగంగ, ప్రాణహిత, వార్ధా నదులు ప్రమాద స్థాయికి చేరువలో ఉన్నాయని విపత్తు నిర్వహణ విభాగం తెలి పింది. ఎల్లంపల్లి డ్యాం నుంచి 12.47 క్యూసెక్కుల నీటిని గోదావరి నదిలోకి విడుదల చేయడంతో అహేరి, సిరొంచ తాలూకాలలోని నదుల సమీపంలో నివసించే గ్రామాల ప్రజలను యుద్ధ ప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు విపత్తుల సెల్ నివేదిక పేర్కొంది. ఇప్పటి వరకు 29 గ్రామాలకు చెందిన 3,033 మందిని సహాయ కేంద్రాలకు తరలించామని, రెండు రోజులుగా జిల్లాలో వర్షాల వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది.

అడపాదడపా వర్షాలు.. ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం

ముంబై: ముంబై, దాని శివారు ప్రాంతాల్లో గురువారం అడపాదడపా వర్షాలు కురిశాయి. ఈ కారణంగా నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. గురువారం శాంటాక్రూజ్ (పశ్చిమ శివారు), కొలాబా (దక్షిణ ముంబై)లోని వాతావరణ అబ్జర్వేటరీలలో వరుసగా 95.2 మిమీ, 62.6 మిమీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ అధికారి తెలిపారు. గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పశ్చిమ శివారులోని మాల్వాని, కండివాలి, దిండోషి, వెర్సోవా మరియు తూర్పు శివారు విక్రోలిలో 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. జోగేశ్వరి, అంధేరి, భాండూప్‌లోని కొన్ని ప్రాంతాలలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ఎడతెరపి లేని వర్షం.. చంపేస్తున్న చలి

ఉదగమండలం(తమిళనాడు): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, చెట్లు కూలిపోవడం, చలి తీవ్రత పెరగడంతో నీలగిరి జిల్లాలో గురువారం జనజీవనం స్తంభించింది. జిల్లాలో, ముఖ్యంగా ఈ పర్యాటక పట్టణం, కూనూరు, గూడలూరు, పందలూరు ప్రాంతాల్లో వారం రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నా యని, దీంతో చెట్లు కూలి ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు. ఊటీ-కూనూర్, ఊటీ-కొత్తగిరి, ఊటీ-గూడలూరు రోడ్లపై 20కి పైగా చెట్లు నేలకూలాయి. వివిధ ప్రాంతాల్లోని నివాసితులకు ముప్పుగా పరిణమించే చెట్లను నరికివేసే పనిలో పరిపాలన నిమగ్నమై ఉంది. బుధవారం రాత్రి నుంచి విద్యుత్ తీగలు తెగిపోవడం, ఆరు పెద్ద చెట్లు రోడ్లపై పడిపోవడంతో ఈ పట్టణంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నప్పటికీ, జిల్లా అంతటా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు చలి కారణంగా ఇళ్లలోనే ఉండిపోయారు.

ఇల్లు కూలి మహిళకు గాయాలు

థానే: మహారాష్ట్రలోని థానే జిల్లాలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు తన ఇంట్లోని కొంతభాగం కూలిపోవడంతో 50 ఏళ్ల మహిళ గాయపడినట్లు అధికారులు తెలిపారు. ముంబ్రా టౌన్‌షిప్‌లోని రషీద్ కాంపౌండ్‌లోని చాల్ (టెన్మెంట్) వద్ద ఉదయం 5.30 గంటలకు ఈ సంఘటన జరిగిందని థానే మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతీయ విపత్తు నిర్వహణ విభాగం చీఫ్ అవినాష్ సావంత్ తెలిపారు. ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షం కారణంగా మహిళ ఇంటి గోడలో కొంత భాగం కూలిపోయిందని ఆయన చెప్పారు. సమా చారం అందుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది, ఆర్డీఎంసీ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన తబస్సుమ్ సయ్య ద్‌ను స్థానిక ఆసుపత్రిలో చేర్చినట్లు అధికారి వివరించారు.

రాజస్థాన్‌లో భారీ వర్షాలు

తూర్పు రాజస్థాన్‌లోని అనేక ప్రదేశాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు నమోదయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది. మౌంట్ అబూ, ప్రతాప్‌గఢ్‌లలో గరిష్టంగా 8 సెం.మీ వర్షపాతం నమోదైంది. కోటాలోని సంగోడ్‌లో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అజ్మీర్‌లోని తత్‌ఘర్, న్స్వారాలోని బగిదోరాలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. బన్స్వారా, సిరోహి, రాజ్‌సమండ్, ప్రతాప్‌గఢ్, ఝులావర్, చిత్తోర్‌గఢ్, బార్మర్, పాలి, జైసల్మేర్, జోధ్‌పూర్, నాగౌర్ జిల్లాల్లో శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది.

మహారాష్ట్రలో పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ తగ్గింపు

ముంబై: మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఊరట కల్పించింది. పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్ తగ్గిస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ. 3 తగ్గించింది. ముంబైలో లీటర్ పెట్రోల్ రూ.111.35కి లభిస్తోంది. ఇప్పుడది రూ.106.35కి తగ్గనుంది. అదే సమయంలో రూ.97.28గా ఉన్న డీజిల్.. రూ. 94.28కే లభ్యం కానుంది. ఈ తగ్గింపుతో రాష్ట్రంపై రూ.6 వేల కోట్ల మేర భారం పడనుంది. అయితే ఈ చర్య వల్ల ద్రవ్యోల్బణం అదుపులోకి రానుందని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వెల్లడించారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇటీవల దేశంలో ఇంధన ధరలు అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రం ఇటీవల రెండు సార్లు తగ్గించింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రాలు కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. అయితే, వ్యాట్ తగ్గించేందుకు మహారాష్ట్ర ఒప్పుకోలేదు. ఈ విషయమై ఆ మధ్య కేంద్రం, అప్పటి ఠాక్రే సర్కారు మధ్య మాటలయుద్ధం కూడా జరిగింది. ఈ క్రమంలో బీజేపీ మద్దతుతో శివసేన చీలిక వర్గ నేత షిండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగానే.. ఇంధన ధరలపై వ్యాట్‌ను తగ్గించనున్నట్టు ప్రకటించారు. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆ నిర్ణయం తీసుకున్నారు.

కరోనాతో ఆస్పత్రిలో చేరిన తమిళనాడు సీఎం

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల క్రితం ఆయన కరోనా బారిన పడ్డారు. దీంతో తొలుత ఇంట్లోనే స్వీయ నిర్బంధంలో ఉన్న ఆయన.. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో గురువారం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. మంగళవారం స్టాలిన్ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. అలసట, జ్వరంగా అనిపించడంతో కరోనా పరీక్షలు చేయించుకోగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని సీఎం ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌లు ధరించాలని, వాక్సినేషన్ చేయించుకోవాలని మరోసారి ప్రజలను అభ్యర్థించారు. గురువారం ఉదయం ఆయన కరోనా లక్షణాలతో చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయాన్ని ఆసుపత్రి యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్న వివరాలు వెల్లడించలేదు. స్టాలిన్ త్వరగా కోలుకోవాలని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, మాజీ సీఎం ఓ.పన్నీర్ సెల్వం, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు.

అమర్‌నాథ్ యాత్రకు మళ్లీ ఆటంకం

శ్రీనగర్: ఎడతెరిపిలేని వర్షాలతో అమర్‌నాథ్ యాత్రకు ఆటంకాలు ఎదురవు తున్నాయి. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం, బల్తాల్ మార్గాల్లో భక్తులు వెళ్లేందుకు అక్కడి సిబ్బంది అనుమతించడం లేదు. వర్షాలు తగ్గేవరకు యాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) అధికారులు సమాచారం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఐటీబీపీ వర్గాలు స్పందిస్తూ 'యాత్ర కొంతకాలం నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. పహల్గాం, బల్తాల్ మార్గాల ద్వారా వెళ్లే యాత్రికులను నిలిపివేశాం. వర్షం తగ్గాక పరిస్థితిని సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు. అధిక వర్షాల కారణంగా జులై 5, 8న ఇప్పటికే రెండుసార్లు యాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే.

వేర్వేరు బస్సు ప్రమాదాల్లో గాయపడ్డ 13మంది అమర్‌నాథ్ యాత్రికులు

జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం, గందర్‌బాల్ జిల్లాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 13మంది అమర్‌నాథ్ యాత్రికులు గాయపడినట్టు అధికారులు తెలిపారు. వీరిలో ఎనిమిదిమంది కుల్గాం జిల్లాలో జరిగిన ప్రమాదంలో, మరో ఐదుగురు గందర్‌బాల్‌లో గాయపడినట్టు వివరించారు. కుల్గాం ప్రమాదంపై అధికారులు మాట్లాడుతూ 40మంది యాత్రికులతో వస్తున్న బస్సుపై డ్రైవర్‌కు నియంత్రణ కోల్పోవడంతో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టినట్టు తెలిపారు. మరో ప్రమాదం గందర్‌బాల్‌లోని కన్‌గామ్ ప్రాంతంలో ఉన్న సత్రినా వద్ద జరిగినట్టు వివరించారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించినట్టు వివరించారు.

20 వేలు దాటిన కొత్త కేసులు..!

న్యూఢిల్లీ: దేశంలో కరోనావ్యాప్తి మరోసారి పెరుగుతోంది. ఫిబ్రవరి చివరి నుంచి 20 వేల దిగువనే నమోదవుతోన్న కొత్త కేసులు 145 రోజుల తర్వాత ఆ మార్కును దాటాయి. బుధవారం 3.94 లక్షల మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా.. 20,139 మందికి పాజిటివ్‌గా తేలింది. బుధవారం కంటే నాలుగువేల మేర అదనంగా వెలుగుచూశాయి. దాంతో పాజిటివిటీ రేటు 5.10 శాతంగా నమోదైంది. ఇప్పటి వరకూ 4.36 కోట్ల మంది మహమ్మారి బారినపడ్డారని గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుత వైరస్ వ్యాప్తితో క్రియాశీల కేసులు 1.36 లక్షలకు చేరాయి. మొత్తం కేసుల్లో క్రియాశీల కేసుల వాటా 0.31 శాతానికి పెరగ్గా.. రికవరీ రేటు 98.49 శాతానికి తగ్గింది. 24 గంటల వ్యవధిలో 16,482 మంది కోలుకొన్నారు. 38 మంది మరణించారు. మొత్తం మృతుల సంఖ్య 5.25 లక్షలు దాటింది. ఇక కేంద్రం గత ఏడాది ప్రారంభం నుంచి నిర్వహిస్తోన్న టీకా కార్యక్రమం కింద 199 కోట్లకుపైగా డోసులు పంపిణీ అయ్యాయి. బుధవారం 13.44 లక్షల మంది టీకా తీసుకున్నారు. ఆరు నెలల తర్వాత యాంటీబాడీల స్థాయి తగ్గుతున్న విషయం ఐసీఎంఆర్ సహా ఇతర అంతర్జాతీయ పరిశోధనా సంస్థల అధ్యయనంలో తేలడంతో.. బూస్టర్ డోసు విషయంలో బుధవారం కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఈనెల 15వ తేదీ నుంచి ఉచితంగా కొవిడ్ టీకా బూస్టర్ (ముందు జాగ్రత్త) డోస్ ఇవ్వాలని నిర్ణయించింది.

కొండచరియలు విరిగిపడి తండ్రీ, కుమారుడి మృతి

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని ఊరికి దూరంగా ఉన్న రియాసి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో తండ్రి, కుమారుడు మృతి చెందినట్టు గురువారం అధికారులు తెలిపారు. మరణించిన వ్యక్తిని మహ్మద్ షఫీ(65), కుమారుడు అబ్దుల్ రషీద్(30)గా గుర్తించారు. వీరిద్దరూ తమ పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా బుధవారం సాయంత్రం థిల్లు-కలాడ్ గ్రామంలోని అర్నాస్ ప్రాంతానికి వచ్చే సరికి, భారీ కురుస్తున్న వర్షానికి కొండచరియలు విరిగి వారిపై పడ్డాయని పేర్కొన్నారు. శిథిలాల్లో చిక్కుకుపోయిన మృతదేహాలను స్థానికులు బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. చట్టపరమైన తంతు ముగిసిన అనంతరం మృతదేహాలను ఖననం చేసినట్టు వివరించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై బీజేపీ నిరసన

న్యూఢిల్లీ: నగరంలో విద్యుత్ బిల్లుల పెంపుపై ఢిల్లీ బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆ పార్టీ ఎంపీ రమేశ్ బిధూరి అధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం వద్ద నిరసనకు దిగారు. ఆందోళనకారులు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకోకుండా అడ్డుకునేం దుకు బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు వాటర్ క్యానన్లను ఉపయోగించి వారిని చెదరగొట్టారు. 'అనేక సంవత్సరాలుగా వివిధ ఛార్జీలు, సర్‌చార్జీల ద్వారా కేజ్రీవాల్ ప్రభుత్వం ఢిల్లీ ప్రజల నుంచి కోట్లాది రూపాయలను దోచుకుంది' అని నిరసనకారులను ఉద్దేశించి బిధూరి పేర్కొన్నారు. పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు (డిస్కమ్‌లు) పవర్ కొనుగోలు సర్దుబాటు ఖర్చును రెండు-ఆరు శాతం పెంచేందుకు ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ జూన్‌లో అనుమతించింది. ఈ పెంపును తదుపరి బిల్లులో కలుపుతారు.

నానో ఎరువులకు ప్రాచుర్యం కల్పించండి

రాష్ట్రాలకు కేంద్ర మంత్రి మాండవియా విజ్ఞప్తి

బెంగళూరు: దేశీయంగా అభివృద్ధి చేసిన నానో ఎరువులకు ప్రాచుర్యం కల్పించాలని, రసాయనిక ఎరువులకు బదులుగా వాటిని వాడాలని కేంద్ర ఆరోగ్య, రసాయనశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా గురువారం రాష్ట్రాలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ జరిగిన రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన మంత్రుల జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో మాండవ్య ప్రసంగించారు. 'ప్రపంచంలోని ఎరువుల వినియోగంలో భారత్ ఎరువుల వినియోగం 35 శాతం ఉంటే, భారత్ ఏటా 70 లక్షల నుండి 100 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు దిగుమతి చేసుకుంటుంది' అని ఆయన చెప్పారు. సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు ఒక్కొక్క నానో ఎరువుల బస్తా రూ.266లకు అందజేస్తున్నారని, వాస్తవానికి ప్రభుత్వానికి రూ.2,300 ఖర్చవుతుందన్నారు. 'భారత ప్రభుత్వం ఎరువులపై రూ.2.5 లక్షల కోట్లను సబ్సిడీగా ఖర్చు చేస్తోంది. ఇది కర్ణాటక వంటి పెద్ద రాష్ట్ర వార్షిక బడ్జెట్‌తో సమానమని మాండవ్య చెప్పారు. ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యలను భారత శాస్త్రవేత్తలు గ్రహించి నానో ఎరువులను అభివృద్ధి చేశారని కేంద్ర మంత్రి తెలిపారు. 'ఒక్కో నానో ఎరువుల బాటిల్ ఎరువుల సంచితో సమానం, ఒక్కో బాటిల్ ధర రూ.240. కోటి నానో ఫెర్టిలైజర్ బాటిళ్లు నాలుగు లక్షల టన్నుల ఎరువుల బస్తాలకు సమానం... వాటికి ప్రాచుర్యం కల్పించగలమా? నేనూ నా 100 ఎకరాల భూమిలో దాన్ని వినియోగించా. సమర్థవంతంగా పనిచేసింది' అని మాండవ్య చెప్పారు. నానో ఫెర్టిలైజర్ బాటిళ్లపై అధ్యయనాలు జరిగాయని, అవి సురక్షితం... ప్రభావవంతమైనవిగా గుర్తించినట్లు మంత్రి తెలిపారు. 2025 నాటికి దేశంలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువుల స్థానంలో తొమ్మిది నానో ఎరువుల ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని మాండవ్య తెలిపారు. త్వరలో ప్రారంభించనున్న భారతీయ జన్ ఉర్వరక్ యోజన (ఇండియన్ పీపుల్స్ ఫెర్టిలైజర్ స్కీమ్) కింద రానున్న రోజుల్లో ఒకే దేశం, ఒక ఎరువును సాధించాలనుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. పరిశ్రమలకు సబ్సిడీ ఎరువుల మళ్లింపును అడ్డుకోవాలని మాండవ్య రాష్ట్రాలకు విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ సప్లై మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐఎఫ్ఎస్ఎంఎస్) కింద కేంద్రం చేసినట్లుగా రాష్ట్రాలు తమ సొంత డ్యాష్‌బోర్డ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర తోమర్, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి బిసి పాటిల్, వివిధ రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు, వ్యవసాయ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సుబ్రతా రాయ్‌పై పాట్నా హైకోర్టు ఆదేశాలను కొట్టివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సహారా గ్రూప్ అధినేత సుబ్రతా రాయ్‌ను తమ ముందు హాజరు కావాలని ఆదేశించడంతోపాటు ముందస్తు బెయిల్ కేసులో పాట్నా హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. మరొకరి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ... ముందస్తు బెయిల్ మంజూరు కోసం దాఖలు చేసిన అభ్యర్థనను స్వీకరించినప్పుడు, వాస్తవా లతో సంబంధం లేని విషయాలపై విచారణ చేసిందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'ప్రస్తుత కేసులో, హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు కోసం చేసిన దరఖాస్తును పెండింగ్‌లో ఉంచినట్లు మేము గమనిం చాము. థర్డ్ పార్టీలను కోర్టుకు హాజరుకావాలని నోటీసు జారీ చేయడంతో సహా ఆదేశాలు జారీ చేసింది. 'మా అభిప్రాయం ప్రకారం, అది అనుమతిం చబడదు. పరిగణనలోకి తీసుకోబడదు' అని న్యాయమూర్తులు ఎఎం ఖాన్విల్కర్, జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఫిబ్రవరి 11, ఏప్రిల్ 27న పాట్నా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. తన ముందు పెండింగ్‌లో ఉన్న బెయిల్ పిటిషన్‌లో సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీస్ లిమిటెడ్, రాయ్‌లను వైరి పక్షాలుగా చేర్చాలని ఫిబ్రవరి 11న ఆదేశించిన హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై గతంలో సుప్రీం కోర్టు స్టే విధించింది. తరువాత వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

గ్రామాల్లో హెలిప్యాడ్‌లు సరే పాఠశాలలకు వెళ్లేందుకు రోడ్లు వేయలేరా

మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ముంబై : గ్రామాల్లో హెలీప్యాడ్‌ల నిర్మాణాలు సరే ఆ గ్రామంలోని విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి మంచి రోడ్లు లేకపోవడం ఏమిటని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాల్లోకి వెళితే సీఎం ఏక్‌నాథ్ షిండే సొంత జిల్లా అయిన సతారా జిల్లాలోని ఖిర్కింది గ్రామంలోని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు మంచి రోడ్డు సౌకర్యం కూడా లేని దుస్థితిపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం కింద సుమోటోగా హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ ప్రసన్న వరాలే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ప్రభుత్వ వ్యవహార తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఆ గ్రామంలోని పిల్లలు చదువుకోవడం కోసం కోయినా నదికి చెందిన బ్యాక్ వాటర్స్‌లో పడవలో, అనంతరం అడవి మార్గంలో పాఠశాలకు వెళ్ల వలసిన దుస్థితి ఉందని పేర్కొంది. జిల్లాలోని ఒక గ్రామంలో రెండు హెలీప్యాడ్‌లు ఉన్నాయని అయితే రోడ్లు, వంతెనలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి సమస్యలకు శాశ్విత పరిష్కారాన్ని చూపడానికి చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు చేపట్టి ఆ నివేదికను ఆగస్టు 30 లోగా తమకు సమర్పించాలని ఆదేశించింది.

మంటగలుస్తున్న ఆదివాసీ హక్కులు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులను కాలరాస్తూ దాడులకు పూనుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని కోయకొచగూడెంలో ఆదివాసుల మహిళలపై ఫారెస్ట్, పోలీస్ అధికారులు దాడి చేసిన ఘటనపై నిజాలు తెలుసుకునేందుకు కోయకొచగూడెం సందర్శించిన అనంతరం మంచిర్యాలీ జిల్లా సీపీఐ కార్యాలయంలో నారాయణ విలేకరులతో మాట్లాడారు. అడవులను కాపాడుతోంది ఆదివాసీయులైతే ప్రభుత్వాలు వారి హక్కులను కాలరాస్తూ కేసులు నమోదు చేస్తూ జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. అటవీ భూములను, అడవులను పాలకులు సామ్రాజ్య వాదులకు దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులే లేకుంటే అడవి, భూమి ఉండేవి కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులకు, గిరిజనులకు, హరిజనులకు భూముల పట్టాలిస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చి సంవత్సరాలు దాటుతున్నా పట్టించుకునే నాథుడే లేడని మండిపడ్డారు. ఆదివాసులపై దాడులు పునరావృతమై సీపీఐ అధ్వర్యంలో పోరాటలకు వెనుకడామని హెచ్చరించారు. వెంటనే కోయకొచగూడెం ఆదివాసులపై కేసులు ఎత్తివేసి దాడులు చేసిన ఫారెస్ట్ అధికారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు కొయ్యడ సృజన్ కుమార్, సదానందం, మంచిర్యాల సీపీఐ జిల్లా నాయకులు, సీపీఐ అనుబంధ సంఘాల బాధ్యులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, మిరియాల రాజేశ్వరరావు, కే వీరభద్రయ్య, ఎస్‌కే బాజీ, సైదా ముష్కి, సమ్మయ్య, కొట్టే కిషన్‌రావు, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, బి సుదర్శన్, దాగం మల్లేష్ , దుర్గ రాజ్, గుండా మాణిక్యం, కనుకుంట్ల సన్నీ గౌడ్లిం, లింగం రవి, మొగిలి లక్ష్మణ్, ఖలింద్ర, అలీఖాన్ ఉన్నారు.

ఎట్టకేలకు గొటబాయ రాజీనామా

- సింగపూర్‌కు చేరుకున్నాకే ప్రకటన
- ఆ షరతుతోనే పదవిని వీడటంలో జాప్యం
- ఆపద్ధర్మ అధ్యక్షుడిగా విక్రమసింఘె

కొలంబో: ప్రజాగ్రహానికి గురైన దేశాన్ని వీడిన శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స తన రాజీ నామాను గురువారం సమర్పించారు. మాల్దీవుల నుంచి సింగపూర్‌కు పలాయనం సాగించిన తర్వాత ఈ -మెయిల్ ద్వారా రాజీనామా లేఖను పంపారు. వాస్తవానికి ఈనెల 12న రాజీనామా చేయాలిగానీ కుటుంబసమేతంగా సురక్షితంగా దేశం వీడే షరతుతో దానిని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఒక వేళ రాజీనామా చేయకపోతే గొటబాయను పదవి నుంచి తప్పించాలంటే శ్రీలంక రాజ్యాంగం ప్రకారం మొత్తం న్యాయవ్యవస్థ సహకరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా పార్లమెంటులో రెండింట మూడొంతుల మంది ఆయనకు వ్యతి రేకంగా ఓటు వేయాలి. అయితే తాజా పరిస్థితుల్లో ఇది సాధ్యం కాదుగనుకనే గొటబయ డిమాండ్లకు రణిల్ విక్రమసింఘే, వైమానిక దళం సహకరిం చినట్లు సమాచారం. దేశాలు దాటిన అనంతరం గొటబాయ రాజపక్స అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఇదే విషయాన్ని శ్రీలంక పార్లమెంటు ధ్రువీకరించింది. స్పీకర్ మహింద్ర అభయవర్ధనకు గొటబాయ రాజీనామా లేఖ అంది నట్లు తెలిపింది. గొటబాయ రాజీనామా వార్త అక్కడి ప్రజల్లో ఆనందాన్ని నింపింది. వారు సంబురాలు జరుపుకున్నారు. తొలుత మాల్దీవులకు వెళ్లిన గొటబాయకు అక్కడ నిరసన సెగ తగిలింది. దీంతో ఆయన సింగపూర్‌కు చేరుకున్నారు. పరిస్థితులు చేయి దాటడంతో అధ్యక్షుడిగా రాజీనామా చేస్తు న్నట్లు గొటబాయ ప్రకటించారు. ఆపద్ధర్మ అధ్యక్షునిగా ప్రధాని రణిల్ విక్రమసింఘే వ్యవహరిస్తున్నారు.

ఎమర్జెన్సీ ప్రకటన - కర్ఫ్యూ విధింపు - ఆగని ఆందోళనలు : తాజా పరిస్థితుల్లో అత్యవసర స్థితిని శ్రీలంక యంత్రాంగం ప్రకటించింది. పశ్చిమ ప్రావిన్స్‌లో కర్ఫ్యూ విధించింది. ఆందోళనకారులు శాంతిం చడం లేదు. దేశ పరిస్థితి మెరుగయ్యే సూచనలు లేవు. గురువారం కూడా ఆందోళనకారులు విక్రమసింఘె అధికారిక నివాసాన్ని ముట్టడించారు. వేలాదిగా అక్కడకు చేరుకొని బారికేడ్లు విరగొట్టారు. ప్రధాన ద్వారాన్ని దాటుకొని లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో భద్రతాబలగాలు అడ్డుకొని బాష్పవాయువును ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టాయి. కొందరు ముందుజాగ్రత్తగా వివిధ రకాల మాస్కులు ధరించి రావడంతో వారిపై బాష్పవాయువు ప్రభావం చూపలేదు. రాళ్లు, సీసాలు, చెప్పులను భద్రతా బలగాలపైకి నిరసనకారులు విసిరారు. విక్రమసింఘె నివాసం ప్రధాన ద్వారాన్ని ధ్వంసం చేసి అధికారిక భవనంలోకి చొరబడి లాన్స్, స్టెప్స్, సమావేశ మందిరాలలోకి ఆందోళకారులు ప్రవేశించారు. సంయమనం పాటిస్తారా చర్యలను ఎదుర్కొంటారా అంటూ నిరసనకారులను దేశ సైన్యం గదమాయించింది. గురువారం ఉదయం కర్ఫ్యూను ఎత్తివేసినప్పటికీ హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే క్రమంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా తిరిగి నిషేధాజ్ఞలను అమలు చేసింది. ఎమర్జెన్సీ విధించిన క్రమంలో పార్లమెంటు వద్ద యుద్ధట్యాంకర్లను సిద్ధంగా ఉంచింది. ఆందోళనకారులు ఎవ్వరూ పార్లమెంటు వద్దకు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇదే క్రమంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఏమి చేయగలరో అంతా చేయండి అని సైన్యానికి విక్రమసింఘె బుధవారమే ఆదేశాలివ్వడం విదితమే.

ఆశ్రయం ఇవ్వలేదు : సింగపూర్

గొటబాయ కుటుంబం తమ దేశానికి రావడం నిజమేగానీ అది వారి వ్యక్తిగత పర్యటన అని సింగపూర్ ప్రభుత్వం తెలిపింది. తామేమీ ఆశ్రయం కల్పించలేదని, అందుకోసం ఆయన కోరలేదని ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది.

మా ప్రమేయం లేదు : భారత్ హైకమిషన్

గొటబాయ రాజపక్సే దేశం విడిచి వెళ్లడానికి భారత ప్రభుత్వం సహకరించినట్లు జరిగిన ప్రచారాన్ని హైకమిషన్ తీవ్రంగా ఖండించింది. ఇందులో భారత్ ప్రమేయం లేదని ప్రకటించింది. 'శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్సే మాల్దీవులకు వెళ్లడానికి భారత ప్రభుత్వం సహకరించిందన్న వార్తలు నిరాధారం. వీటిని హైకమిషన్ ఖండించింది' అని మాల్దీవుల్లోని భారత హైకమిషన్ తెలిపింది.

మహీంద్ర, బసిల్ ఎక్కడికీ వెళ్లరు..

శ్రీలంక సుప్రీంకోర్టులో పిటిషన్ల విచారణ జరిగేంత వరకు మాజీ ప్రధాని మహీంద్ర రాజపక్సే, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బసిల్ రాజపక్సే దేశాన్ని విడిచి వెళ్లరని వారి న్యాయవాదులు గురువారం వెల్లడించారు. వీఐపీ టర్మినల్ ద్వారా దేశాన్ని వీడేందుకు గొటబాయ సోదరుడు బసిల్ ప్రయత్నించిన క్రమంలో ఆయనపై సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఏప్రిల్‌లో ఆర్థిక మంత్రిగా తప్పుకున్న బసిల్ జూన్‌లో పార్లమెంటు స్థానాన్ని వీడారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి ఈయనే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. మహీంద్ర రాజపక్సే మే 9న ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు తీవ్రతరం కావడంతో ఆయన రాజీనామా సమర్పించారు. అప్పట్లోనే ఈయన విదేశీయానాన్ని నిషేధిస్తూ శ్రీలంక కోర్టు ఒకటి ఉత్తర్వులు జారీచేసింది.

'ఐ2యూ2'తో ఆచరణాత్మక సహకారం: మోదీ

న్యూదిల్లీ: నాలుగు దేశాల కూటమి 'ఐ2యూ2' సానుకూల ఎజెండాను ఏర్పాటు చేసిందని, పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఆచరణాత్మక సహకారానికి దాని చట్రం మంచి నమూనా అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం వర్చువల్ విధానంలో జరిగిన ఐ2యూ2 (భారత్, అమెరికా, ఇజ్రాయిల్, యూఏఈ దేశాల కూటమి) తొలి శిఖరాగ్ర సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఇజ్రాయిల్ ప్రధాని యాయిర్ లాపిడ్, యుఏఈ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో పాటు మోదీ పాల్గొన్నారు. మోదీ మాట్లాడుతూ... ఇంధన భద్రత, ఆహార భద్రత, ఆర్థిక వృద్ధి రంగాలలో ఈ కూటమి ప్రధాన పాత్ర పోషించడంతో పాటు సహకారం అందిస్తుంద న్నారు. 'మనం అనేక ప్రాంతాలలో ఉమ్మడి ప్రాజెక్టులను గుర్తించాము . వాటిలో ముందుకు సాగడానికి రోడ్‌మ్యాప్‌ను కూడా సిద్ధం చేశాము' అని చెప్పారు. ఐ2యూ2 చట్రం కింద నీరు, ఇంధనం, రవాణా, అంతరిక్షం, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి ఆరు కీలక రంగాలలో ఉమ్మడి పెట్టుబడులను పెంచడానికి మనం సమ్మతిని తెలిపాం' అని మోదీ అన్నారు. పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి మధ్య ఆచరణాత్మక సహకారానికి కూటమి సహకార చట్రం మంచి నమూనా అని ఆయన అన్నారు. 'మన దేశాల పరస్పర సామర్థ్యాలు (మూలధనం, నైపుణ్యం, మార్కెట్లు) సమీకరించడం ద్వారా మన ఎజెండాను వేగవంతం చేయవచ్చు...ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడవచ్చు' అని మోదీ అన్నారు. ఐ2యూ2తో ఇంధన భద్రత, ఆహార భద్రత, ప్రపంచ స్థాయిలో ఆర్థిక వృద్ధికి గణనీయమైన సహకారం అందించగలమని తాను దృఢంగా విశ్వసిస్తున్నట్లు మోదీ చెప్పారు. ఐ2యూ2 కూటమిని పశ్చిమ ఆసియాకు క్వాడ్‌గా పిలుస్తారు. ముఖ్యంగా నీరు, శక్తి, రవాణా, అంతరిక్షం, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి ఆరు రంగాలలో ఉమ్మడి పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా దీనిని స్థాపించారు. గతేడాది అక్టోబర్ 18న జరిగిన నాలుగు దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో కూటమిని రూపొందించారు.

అక్టోబరు 2 నుంచి భారత్ జోడో యాత్ర

న్యూదిల్లీ: కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కాంగ్రెస్ చేయనున్న భారత్ జోడో యాత్రను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ నేతలు ప్రణాళికలు రూపొందించారు. ఇదే విషయమై కాంగ్రెస్ కీలక నేతలు గురువారం న్యూదిల్లీలో సమావేశమయ్యారు. అనంతరం కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడారు. భారత్ జోడో యాత్రను అక్టోబరు 2వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో భారత్ జోడో యాత్ర సాగుతుందన్నారు. ఎన్డీయే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా 3,500 కిలోమీటర్ల పాదయాత్ర జరుగుతుందని సింగ్ తెలిపారు. నిరుద్యోగులు, రైతులు, బలహీన వర్గాల పక్షాన నిలిచిన క్రమంలో ఈ యాత్రకు కాంగ్రెస్ పూనుకున్నట్లు చెప్పారు. రాజ్యాంగ సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని సింగ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రణాళికా కమిటీ సంఘం చైర్మన్‌గా ఉన్న పార్టీ అధినేత్రి సోనియాగాంధీ అధ్యక్షతన దాదాపు గంటసేపు సమావేశం జరిగింది. రాబోయే పార్లమెంటు సమావేశాలపైనా నేతలు చర్చించారు. ఎల్పీజీ, ధరల పెంపు,నిరుద్యోగం, అగ్నిపథ్ వంటి అంశాలపై పార్లమెంటులో అధికార పక్షాన్ని నిలదీస్తామని పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే వెల్లడించారు. సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్లపైనా కేంద్రాన్ని ప్రశ్నిస్తామన్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లిన క్రమంలో సమావేశానికి హాజరు కాలేదు. హాజరైన వారిలో పార్టీ సీనియర్ నేతలు అధిర్ రంజన్ చౌదరి, పి.చిదంబరం, జైరాం రమేశ్, కె.సురేశ్, మాణిక్యం ఠాగూర్ ఉన్నారు.

33వేల మద్యం బాటిళ్ల ధ్వంసం

విశాలాంధ్ర-అద్దంకి: జిల్లా వ్యాప్తంగా అనేక పోలీస్‌స్టేషన్లు, ఎస్‌ఈబీ స్టేషన్‌ల పరిధిలో సీజ్ చేసిన రూ.66 లక్షల విలువైన 33,632 అక్రమ మద్యం బాటిళ్లను రోడ్డురోలర్‌తో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం స్వయంగా ధ్వంసం చేశారు. అక్రమ మద్యం రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వకుల్ జిందాల్ హెచ్చరించారు. 1824 కేసులకు సంబంధించి వివిధ బ్రాండ్లను ధ్వంసం చేసినట్టు వివరించారు. ఇకపై ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని, జిల్లాలో నాటుసారా, అక్రమ మద్యం, గంజాయి, గుల్కా, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. జిల్లా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అడిషనల్ ఎస్పీ పీ మహేష్, ఎస్‌ఈబీ ఏఈవో జీ నరశింహారావు, బాపట్ల ఎస్‌డీపీఓ శ్రీనివాసరావు, చీరాల ఎస్‌డీపీఓ శ్రీకాంత్, అద్దంకి ఎస్‌ఈబీ సీఐ రమేష్, సీఐ రోశయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన టోకు ధరల ద్రవ్యోల్బణం

జూన్‌లో 15.18 శాతం నమోదు

న్యూదిల్లీ: టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) స్వల్పంగా తగ్గింది. జూన్‌లో 15.18శాతానికి చేరింది. ఆహార వస్తువుల ధరలు పెరిగినప్పటికీ టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం గత నెలలో రికార్డు స్థాయిలో 15.88 శాతానికి పెరిగింది. గతేడాది జూన్‌లో 12.07 శాతంగా నమోదైంది. గతేడాది ఏప్రిల్ నుంచి డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం వరుసగా 15వ నెలలో రెండంకెల స్థాయిలోనే ఉంది. జూన్‌లో ఆహార వస్తువుల ద్రవ్యోల్బణం 14.39 శాతంగా ఉంది. కూరగాయలు, పండ్లు, బంగాళాదుంపల ధరలు గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగాయి. మేలో ఆహార వస్తువుల టోకు ధరల ద్రవ్యోల్బణం 12.34 శాతంగా ఉంది. కూరగాయల ధరల పెరు గుదల రేటు 56.75 శాతం కాగా, బంగాళ దుంపలు, పండ్లలో 39.38, 20.33 శాతం చొప్పున ఉంది. ఇంధనం, విద్యుత్తు ద్రవ్యోల్బణం 40.38 శాతంగా ఉండగా, తయారీ ఉత్పత్తులు, నూనె గింజలలో 9.19 శాతం, 2.74 శాతంగా నమోదు అయింది. జూన్‌లో ముడి పెట్రోలియం, సహజ వాయువు ద్రవ్యోల్బణం 77.29 శాతంగా ఉంది. ద్రవ్య విధానాన్ని రూపొందించడానికి భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) రిటైల్ ద్రవ్యోల్బణాన్ని పరిశీలిస్తుంది. వడ్డీని నిర్ణయించే ద్రవ్య విధాన కమిటీ తదుపరి సమావేశం ఆగస్టు 2-4 తేదీలలో జరుగుతుంది. రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా ఆరో నెలలో ఆర్బీఐ సౌకర్య స్థాయి కంటే ఎక్కువగా ఉంది. ఇది జూన్‌లో 7.01 శాతంగా నమోదు అయింది. కాగా, జూన్ త్రైమాసికం (క్యూ1)లో ద్రవ్యోల్బణం 7.5 శాతంగానూ, సెప్టెంబరు త్రైమాసికంలో (క్యూ2) 7.4 శాతం గానూ ఉంది. డిసెంబరు త్రైమాసికంలో (క్యూ3) 6.2 శాతానికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికం (క్యూ4)లో 5.8 శాతానికి తగ్గుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. అధిక ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఆర్బీఐ రెండు నెలల్లో కీలక వడ్డీ రేటును 90 బేసిస్ పాయింట్లు పెంచింది. అదే విధంగా 2022-23కిగాను ద్రవ్యోల్బణం అంచనాను 100 బేసిక్ పాయింట్లు పెంచి 6.7 శాతంగా అంచనా వేసింది.

కేరళలో మంకీపాక్స్.. ఆరోగ్యశాఖ అప్రమత్తం

తిరువనంతపురం: మంకీపాక్స్ భారత్‌కు విస్తరించింది. ఈ మహమ్మారి తొలికేసు కేరళలో నమోదైంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణాజార్జ్ ధ్రువీకరించారు. ఈనెల 12న యూఏఈ నుంచి తిరువనంతపురానికి వచ్చిన కొల్లాంకు చెందిన వ్యక్తికి మంకీపాక్స్ నిర్ధారణ అయినట్లు తెలిపారు. సదరు వ్యక్తికి లక్షణాలు కనిపించడంతో నమూనాలను పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపగా.. పాజిటివ్‌గా తేలింది. ఇప్పటికే వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించినట్లు మంత్రి తెలిపారు. బాధితుడు తొలుత ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి తిరువనంతపురం మెడికల్ కాలేజీకి వెళ్లగా.. అనుమానం రావడంతో నమూనాలను సేకరించి పుణేలోని ల్యాబ్‌కు తరలించారు. మరోవైపు కేరళలో మంకీపాక్స్ కేసు నమోదవడంతో కేంద్రం అప్రమత్తమైంది. ప్రత్యేక ఓ బృందాన్ని పంపనున్నది.

17న విపక్షాల కీలకభేటీ

ఉపరాష్ట్రపతిగా ఉమ్మడి అభ్యర్థి ఎంపికే అజెండా

న్యూదిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికిగాను సమర్థ ఉమ్మడి అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ఈనెల 17న భేటీ కావాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఇదే విషయాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే గురువారం వెల్లడించారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పదవీకాలం ఆగస్టు 10తో ముగియనుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ ఇప్పటికే జారీచేసింది. నామినేషన్లకు జులై 19 వరకు గడువు ఇచ్చింది. కాగా, ఆగస్టు 6న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది.

మహారాష్ట్రలో ప్రభుత్వమే లేదు : సంజయ్ రౌత్

ముంబై: మహారాష్ట్రలో ప్రభుత్వంగానీ కేబినెట్‌గానీ లేదని శివసేన నేత సంజయ్ రౌత్ అన్నారు. వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని ముంచేస్తుంటే గవర్నర్ ఏమయ్యారని ప్రశ్నించారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోనిది అక్రమ ప్రభుత్వమన్నారు. రౌత్ గురువారం విలేకరులతో మాట్లాడారు. నిన్నటి వరకు మార్గదర్శకుడిగా ఉండి ఇప్పుడు ఏమయ్యారు? ఆయన మార్గదర్శకం రాష్ట్రానికి ఇప్పుడు అవసరం అని గవర్నర్ కోశ్యారిని ఉద్దేశించి అన్నారు. 'మహారాష్ట్రలోని అనేక భాగాల్లో కలరా వ్యాపించి మరణాలు సంభవిస్తున్నాయి. రాష్ట్రం మరోమారు లాక్‌డౌన్‌లోకి వెళ్లింది. దాదాపు 100 మంది వరదల్లో చనిపోయారు. ఇది అక్రమమైన ప్రభుత్వం కాబట్టి రాష్ట్రంలో సర్కార్ లేదు. మన గవర్నర్ ఎక్కడున్నారు? నిన్నటి వరకు మార్గదర్శకుడిగా ఉండి ఈ రోజు ఏమయ్యారు? ఆయన మార్గదర్శకత్వం రాష్ట్రానికి అవసరం' అని రౌత్ అన్నారు. పార్టీ ఫిరాయించిన శివసేన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని చెప్పారు. తిరుగుబాటు శాసనసభ్యుల నెత్తిపై కత్తి వేలాడుతోందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలపై అనర్హత ఫిర్యాదు మీద సుప్రీంకోర్టు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు కాబట్టి కేబినెట్ విస్తరణ జరగలేదని తెలిపారు. రెబల్ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం రాజ్యాంగబద్ధమైనది కాదన్నారు. ఇది రాజకీయ అవినీతి అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గవర్నర్ ఏమీ చేయరాదని రౌత్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.